ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 18 ఏప్రిల్ 2025



పిల్లర్ల దశలో నిలిచిపోయిన కళాశాల నిర్మాణ పనులు(ఫైల్ ఫోటో)



12 రోజులు.. రూ.35.97 కోట్లు

- ముస్సిపాల్టీలకు కాసులే కాసులు
- కలిసివస్తోన్న 5 శాతం పన్ను రాయితీ
- స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తున్న యజమానులు
- ప్రథమస్థానంలో అద్దంకి.. నాల్గోస్థానంలో గురజాల

ఆస్తి పన్ను చెల్లించండి.. అని ప్రచారాలు చేయకుండానే. కుళాయిలు కట్ చేస్తామని బెదిరింపులు అవసరం లేకుండానే.. యజమానులు పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించగా పన్ను చెల్లింపుదారులు దానిని సద్వినియోగం చేసుకునేందుకు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు కాసులు వర్షం కురుస్తోంది. ఈ నెల 6వ తేదీ నుంచి పన్నుల చెల్లింపులపై రాయితీ ప్రకటించగా కేవలం 12 రోజుల్లో యజమానులు రూ.35.97 కోట్లు చెల్లించారు. గతంలో పన్నుల వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేసేవారు. కొన్ని దగ్గర్ల అయితే బకాయిలు చెల్లించని వారి కుళాయిలు కట్ చేయడం.. నోటీసులు ఇవ్వడం లాంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చేది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం రాయితీ ప్రకటన యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేలా చేసింది. ఈ రాయితీ ప్రకటనతో అధికారులు ఊహించని స్థాయిలో చెల్లింపులు జరిగాయి. ఇందులో పాత బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్ పన్నులు కూడా ఉన్నాయి. స్వచ్ఛంద పన్ను చెల్లింపులో రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మున్సిపాల్టీ ప్రథమ స్థానంలో, పల్నాడు జిల్లా పరిధిలోని గురజాల మున్సిపాల్టీ నాల్గో స్థానంలో నిలిచాయి.





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆస్తి పన్ను రాయితీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటన మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి విశేషస్పందన లభిస్తోంది. రాయితీ అవకాశాన్ని యజమానులు సద్వినియోగించుకుంటున్నారు. 6వ తేదీ నుంచి విస్తృతంగా పన్ను చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.35.97 కోట్లు పన్నులు చెల్లించా రు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలలో పన్ను రాయితీని వినియోగించుకుని యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేందుకు బారులు తీరుతున్నారు. గతంలో పన్నుల వసూళ్లకు మున్సిపల్ సిబ్బంది ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితి లేకుండానే పన్నుదారులు ఎవరికి వారు మున్సిపల్ కార్యాలయాలకు తరలివచ్చి మరీ రాయితీపై పన్ను చెల్లిస్తున్నారు. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మున్సిపాల్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకే రాయితీ అమలు కానున్నది. పన్నుదారులు స్పందించి పన్ను చెల్లిస్తుండటంతో ఊహించని విధంగా వసూలు జరుగుతోంది.

పల్నాడులో నరసరావుపేట అత్యధికం

పల్నాడు జిల్లాలో ఎనిమిది మున్సిపాల్టీలకు సంబంధించి రూ.12.74 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను డిమాండ్ రూ.47.01 కోట్ల ఉండగా రూ.59.75 కోట్లు వసూలుచేయాల్సి ఉంది. కాగా 5 శాతం రాయితీపై ఇప్పటికి రూ.5.35 కోట్లు వసూలైంది. జిల్లాలో అత్యధికంగా నరసరావుపేట మున్సిపాల్టీలో రూ.1.60 కోట్లు పన్ను వసూ లైంది. వినుకొండలో రూ.77లక్షలు, చిలకలూరిపేటలో రూ.72లక్షలు, పిడుగురాళ్లలో రూ.57 లక్షలు, సత్తెనపల్లిలో రూ.74లక్ష లు, మాచర్లలో రూ.35 లక్షలు, దాచేపల్లిలో రూ.28 లక్షలు, గురజాల మున్సిపాల్టీలో రూ.17 లక్షలు చెల్లింపులు జరిగాయి.

గుంటూరు జిల్లాలో రూ.27.12 కోట్లు

గుంటూరు జిల్లాలో పన్ను బకాయిలు రూ.206.76 కోట్లు కాగా ప్రస్తుత సంవత్సరం డిమాండ్ రూ.218.76 కోట్లు ఉంది. బకాయిల్లో రూ 1.16 కోట్లు, డిమాండ్‌లో రూ.25.96 కోట్లు మొత్తం రూ.27.17 కోట్లు వసూలైంది. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.18.77 కోట్లు, తెనాలిలో రూ.2.86 కోట్లు, మంగళగిరి.. తాడేపల్లిలో రూ.4.85 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీలో రూ.64 లక్షలు చెల్లించారు.

బాపట్ల జిల్లాలో చీరాల ప్రథమం

బాపట్ల జిల్లాలోని మున్సిపాల్టీల్లో బకాయిలు రూ.13.05 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ రూ.29.80 కోట్లు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.42.85 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అయితే రాయితీపై ఇప్పటి వరకు రూ.3.45 కోట్లు వసూలైంది. చీరాల మున్సిపాల్టీలో రూ.1.16 కోట్లు, బాపట్లలో రూ.83 లక్షలు, రేపల్లెలో రూ.60 లక్షలు, అద్దంకి మున్సిపాల్టీలో రూ.84 లక్షలు పన్నులు చెల్లించారు.

మెడికల్... మోక్షమెప్పుడు?

- అర్ధంతరంగా నిలిచిన వైద్య కళాశాల పనులు
- 2021లో శంకుస్థాపన.. 2023లో అరకొర పనులతో సరి
- గత ప్రభుత్వంలో నాబార్డ్ నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్లలో మెడికల్ కళాశాల ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియడంలేదు. గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన వైద్య కళాశాల ప్రస్తుతం అతీగతీ లేకుండా పోయింది. 2021లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా.. 2023లో అరకొరగా పనులను ప్రారంభించారు. బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టి వైద్య సేవలను అందుబాటులోకి తేచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితిని విధించుకుంది. కానీ అవేవీ ఆచరణ రూపం దాల్చకపోగా గడచిన ఎన్నికల నాటికి కేవలం పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తి చేయడంతో సరిపెట్టింది. అరకొరగా చేసిన పనులలోనూ పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. కళాశాల కోసం కేటాయించిన భూమి విషయంలోనూ క్విడ్ ప్రో కో జరిగిందని సమాచారం. ఆయా నివేదికలు ప్రస్తుత ప్రభుత్వం వద్దకు చేరడంతో నిర్మాణ పనులను నిలిపేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జరిగిన రెండు డీఆర్సీ సమావేశాల్లోనూ వైద్య కళాశాల అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా త్వరలోనే పనులకు శ్రీకారం చుడతామని ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి ప్రకటించారు. అయితే ఇది జరిగి నెలలు గడుస్తున్నా పనులపై స్పష్టత లేదు. దీంతో మెడికల్ కళాశాలపై జిల్లావాసుల్లో అనుమానాలు నెలకుంటున్నాయి.

నిధులు పక్కదారి..

మెడికల్ కళాశాల నిర్మాణం కోసం నాబార్డు మంజూరు చేసిన రూ.298 కోట్ల నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందనే ఆరోపణలు ఉన్నాయి. పిల్లర్ల వరకు నిర్మాణాలు జరగ్గా రూ.110 కోట్ల వరకు ఖర్చుపెట్టినట్లు సమాచారం. ఈ పనుల బిల్లులను కూడా దాదాపు రూ.52 కోట్లు గత పాలకులు పెండింగ్‌లో పెట్టి వెళ్లగా ఈ ప్రభుత్వం వాటిని చెల్లించింది. మంజూరైన నిధులు, దేని కోసం ఎంత ఖర్చు చేశారు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులెంత అనే అంశాలపై స్పష్టత లేదు.

కొత్త పాలసీకి అనుగుణంగా...

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించడానికి అవలంబించాల్సిన విధానంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను మొదలు పెట్టేందుకు ఇటీవలే ఎస్టిమేషన్లను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పుడు పనులను తిరిగి ప్రారంభించినా కళాశాల నిర్మాణం పూర్తయ్యేసరికి రెండేళ్లు పట్టడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయులకు.. తీపికబురు



- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 248 పోస్టులు
- స్పెషల్ బీఈడీ అభ్యర్థులతో భర్తీకి సన్నాహాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 248కి పైగా పోస్టులను ఇప్పటికే గుర్తించారు. ఆయా పోస్టులను స్పెషల్ బీఈడీ పూర్తి చేసిన అభ్య ర్థులతో భర్తీ చేయనున్నారు. ప్రత్యేక అవస రాల విద్యకు సంబంధించి శిక్షణా కేంద్రాలను సమగ్ర శిక్ష నిర్వహిస్తోంది. ఇందులో మానసిక, శారీరక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తు న్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అనేక జడ్పీ స్కూల్స్‌లో స్పెషల్ బీఈడీ పోస్టులు ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ బీఈడీ పోస్టులు 2260 ఉండగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీ పోస్టులు 151, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 98 ఉన్నాయి. మెగా డీఎస్సీలోనే స్పెషల్ బీఈడీ పోస్టులు కలిపి భర్తీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 72 పైగా భవిత కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల విద్య విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఫిజియోథెరపి, యోగా, మానసిక దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా విద్యను అందిస్తున్నారు. స్పెషల్ బీఈడీ పూర్తిచేసిన వారి ద్వారా ఇక్కడ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసి ఆయా కేంద్రాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల్ని నియమించే అవకాశం ఉందని సంఘాల నాయకులు చెబుతున్నారు.

పోస్టులకు పోటీ తక్కువే..

స్పెషల్ బీఈడీ పోస్టులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నా పోటీ మాత్రం తక్కువగానే ఉంటుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒకప్పుడు హైదరాబా దులోనే స్పెషల్ బీఈడీ కళాశాలలు ఉండేవి. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో కూడా కొన్ని మేనేజ్‌మెంట్స్ స్పెషల్ బీఈడీ కోర్సులు ప్రవేశ పెట్టారు. అయితే కోర్సు పూర్తి చేసిన వారు తక్కువ మంది ఉంటారని విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులకు తక్కువ పోటీ ఉంటుందని చెబుతున్నారు.

8 డాలర్ డ్రీమ్స్ ఢమాల్
ఉన్నత చదువుల కోసం విదేశాలకు విద్యార్థులు
పార్ట్‌టైం జాబ్స్‌కు నెలకొన్న తీవ్ర పోటీ
నెలవారీ ఖర్చులకు తల్లిదండ్రులే ఆధారం


ఇక సరికొత్తగొల్లపాలెం
● సీఎం పర్యటనతో మారుతున్న రూపురేఖలు
● స్వర్ణ గ్రామం కావాలంటూ పిలుపు
● పీ4 విధానంతో 33 కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగు

కుటుంబ వ్యవస్థకు సవాలు
● సమాజంలో పెరిగిపోతున్న వివాహేతర బంధాలు ● తాత్కాలిక ఆకర్షణకు లొంగి.. విలువలకు తిలోదకాలు ● బాపట్ల నడిబొడ్డున ఇద్దరు మృత్యువాత కలకలం

ఉపాధ్యాయులకు ఊరట

- ఎట్టకేలకు తొలగిన యాప్‌ల కష్టాలు
- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- మాట నిలుపుకున్న మంత్రి నారా లోకేశ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరుకు యాప్.. ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్.. మధ్యాహ్న భోజనం అమలుకు యాప్.. మరుగుదొడ్ల నిర్వహణకు యాప్.. విద్యార్థుల మార్కులు అప్‌లోడుకి యాప్.. ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు ఇంతకాలం అల్లాడిపోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌లతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోధన పక్కన పెట్టాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్‌ల కష్టాల నుంచి ఊరట కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు నిత్యం పదికిపైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ తాజాగా అమల్లోకి వచ్చింది. విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500 పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.75 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాస్యం చేస్తుండగా 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశపెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు పదికిపైగా యాప్‌లో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.



నూతన యాప్ నమూనా

ఇక అన్నింటికీ ఒకే యాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడు చేసుకుని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో వినియోగిస్తున్న లాగిన్లను పాస్వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

పనిభారం తగ్గింపు : డీఈవో రేణుక




నూతన యాప్ వల్ల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గుతుందని డీఈవో రేణుక తెలిపారు. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకే యాప్‌లో నమోదు చేయడం వలన అనేక ప్రయోజనలు ఉంటా యన్నారు. ఇప్పటికే జిల్లాలోని హెచ్ఎం, ఉపాధ్యాయులకు యాప్ వివరాలు, ఇన్‌స్టలేషన్, ఉపయోగించే విధానం గురించి తెలియజేశామని తెలిపారు. గతంలో ఉన్న యాప్‌లను అన్ ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్వర్డ్ ఒకచోట నమోదు చేసుకుని తర్వాత అన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

..ఇక రయ్ రయ్

- ఇప్పటికే పలు రహదారుల విస్తరణకు ఆమోదం
- రాజధాని అమరావతి, సముద్ర తీరం కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి
- భూసేకరణ దశలో వినుకొండ-గుంటూరు, నిజాంపట్నం-గుంటూరు రోడ్లు
- తెనాలి- నారాకోడూరు, తెనాలి- మంగళగిరి రోడ్లకు ఇప్పటికే ఆమోదం
- గుంటూరు బాపట్ల, గుంటూరు-పర్చూరు రోడ్ల విస్తరణకు అడుగులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆం ధ్రజ్యోతి): ఒకవైపు రాజ ధాని అమరావతి కేంద్రం.. మరోవైపు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలు జిల్లా కేంద్రాలు.. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సూర్యలంక తీరం.. వీటన్నింటి మధ్య రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణాలు, విస్తరణలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే పలు రోడ్ల పనులు ప్రారంభం కాగా మరికొన్ని ప్రతిపాదనల దశలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తి అయితే ఇక అమరావతి, మూడు జిల్లా కేంద్రాలు, సూర్యలంక తీరం మధ్య రాకపోకలకు ఆటంకాలు లేకుండా రయ్‌రయ్ మంటూ వాహనదారులు రాకపోకలు చేసే అవకాశం ఉంటోంది. రాజధాని అమరావతి పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని ప్రాంతం కావడంతో పాటు.. సమీపంలోనే తీర ప్రాంతం ఉండడంతో వాటి కనెక్టివిటీని పెంచేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో గుంటూరులోని పలు రహదారులకు మహర్దశ పట్టింది. జిల్లాలో అత్యంత కీలకమైన రహదారులను జాతీయ రహదారులుగా మార్చి, నాలుగు లేన్ల రహదారులుగా విస్తరించేందుకు ఆర్ అండ్ బీ ప్రయత్నిస్తోంది. గుంటూరు, రాజధాని అమరావతికి కనెక్టివిటీలో అత్యంత కీలకమైన వినుకొండ- గుంటూరు, నిజాంపట్నం- గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. వాటికి సంబంధించిన భూసేకరణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఆరునెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి రహదారులను విస్తరించనున్నారు. ఈ రెండు రోడ్ల కోసం కేంద్రం రూ.3,105.3 కోట్లు ఖర్చు చేయనుంది. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా జిల్లాలో మరో రెండు రోడ్లను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదముద్ర వేసింది. తెనాలి- నారా కోడూరు, తెనాలి-మంగళగిరి రోడ్లను నాలుగు రోడ్లుగా విస్తరించడానికి అడుగులు పడుతున్నాయి. వాటికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అయితే వాటితోపాటు మరికొన్ని రోడ్లను విస్తరించాలని ఆర్అండ్‌బీ భావిస్తోంది.

మూడు జిల్లాల్లో రోడ్లకు మహర్దశ



పాత మద్రాసు రోడ్డు విస్తరణ?

రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో సూర్యలంక బీచ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కూడా

(మిగతా 8లో)

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

● నలుగురి అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. కొద్దికాలంగా కృష్ణా కెనాల్ రైల్వే జంక్షన్ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారంతో తాడేపల్లి సీఐ కళ్యాణరాజు నిఘా పెట్టి నలుగురిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనలో తాడేపల్లి పట్టణానికి చెందిన పీత దినేష్‌కుమార్ కోటిసూర్య గణేష్, ఉండవల్లి సెంటర్ కు చెందిన మల్లిశెట్టి అనిల్, పెనుమాకకు చెందిన కళ్లం అనిల్‌రెడ్డిలను అరెస్టు చేసినట్టు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ కళ్యాణరాజు ఎస్ఐ ఖాజావలిని, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల విజేతలతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి తదితరులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తూర్పు మాలపల్లెలో మూడు రోజులపాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. మొత్తం 12 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. విజయవాడ స్కై క్లబ్ జట్టు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో హైదరాబాద్ సాయి అకాడమీ జట్టు, తృతీయ స్థానంలో గుంటూరు కేఎల్ యూనివర్సిటీ జట్టు, చతుర్థ స్థానంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ జట్టు విజేతలుగా నిలిచాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పోటీలు సమర్థవంతంగా నిర్వహించిన అంబేద్కర్ మెమోరియల్ కమిటీని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశంసించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పిల్లి కోటి, షైం గణేష్, కె అశోక్, పిల్లి లెనిన్, గేరా రాము, కమలా బోడిబాబు, గట్టుపల్లి మాణిక్యరావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎన్ ఎస్ ఎన్ ఐ ఎస్ పటియాలా సంస్థలో ప్రవేశాలకు ఎమ్ ఎస్ సీ స్పోర్ట్స్ కోచింగ్, పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డిఎస్‌డివో పి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 2వ తేదీలోపు 'ఎస్ఎస్‌సీ. ఎన్ఎస్ఎన్ఐఎస్. ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 515.00 అడుగులు ఉంది. ఇది 140.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మిర్చి కమీషన్ లైసెన్సుల కోసం దరఖాస్తుల జోరు

● టీడీపీ నేతలు, అధికారుల సిఫార్సులు

● ఒక్కో లైసెన్సుకు రూ. 10 లక్షలు పలుకుతున్న ధర



గుంటూరులోని మిర్చియార్డు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ లైసెన్సుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు మార్కెటింగ్ శాఖ డైరెక్టరేట్‌కు వెళుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గం సిఫార్సు చేసిన 10 లైసెన్సులే పెండింగ్‌లో ఉండగా కొత్తగా మరో 25 అప్లికేషన్లు కమిషనర్ కార్యాలయానికి పంపారు. ఇందులో తెలుగుదేశం పార్టీ నేతలు సిఫార్సు చేసినవి 15 వరకు ఉండగా వాటిని అడ్డు పెట్టుకొని యార్డులో లోగడ పని చేసిన అధికారులు మరో 10 చేర్చి పంపించారు. ఇందుకోసం ఒక్కో లైసెన్సుకు రూ. 10 లక్షల వరకు బేరసారాలు జరుగుతున్నాయని మార్కెట్ కమిటీలో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వీటిపై కమిషనర్ నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడుతుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరులో 683 కమీషన్ ఏజంట్ లైసెన్సులు ఉన్నాయి. వీళ్లల్లోనే కొద్ది మందికి వేలం కేంద్రాలు(షాపుల) కేటాయింపు జరగలేదు. మిర్చియార్డులో కొత్తగా దుకాణాలు నిర్మించే పరిస్థితి అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో గతంలోనే అప్పటి కమిషనర్ ప్రద్యుమ్న కొత్తగా ఒక్క కమీషన్ ఏజంట్ లైసెన్సు కూడా ఇవ్వడానికి వీల్లేదని తన వద్దకు వచ్చిన దరఖాస్తులన్నింటిని తిరస్కరించి ప్రభుత్వానికి నివేదించారు. కాగా మిర్చియార్డు ఛైర్మన్‌గా మన్నవ సుబ్బారావు ఉన్న సమయంలో కొంతమంది డైరెక్టర్లు తమకు కమీషన్ ఏజంట్ లైసెన్సులు కావాలని దరఖాస్తు చేసుకొన్నారు. అయితే నిబంధనల ప్రకారం డైరెక్టర్లకు లైసెన్సులు ఇవ్వడానికి లేదు. దాంతో అవి అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఇటీవలే ఆయా డైరెక్టర్లు మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి ఆయనతో సిఫార్సు చేయించుకొన్నారు.

మరోవైపు తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటూరు నగరం నుంచి 15 మందికి కమీషన్ ఏజంట్ లైసెన్సులు ఇవ్వాలని లేఖలతో సిఫార్సులు చేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులు నలుగురు తమ అనుచరులకు మిర్చి కమీషన్ ఏజంట్ లైసెన్సులు ఇవ్వాలని లేఖలు రాశారు. వీటన్నింటికి ఏఎంసీ సెక్రెటరీ, డీఏటీ అండ్ ఎంవో నుంచి సమగ్ర నివేదికలను మార్కెటింగ్ అధికారులు తెప్పించుకొన్నారు. అయితే లైసెన్సు మంజూరు చేయలంటే త్రీమెన్ కమిటీ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. కమీషన్ లైసెన్సులపై ఇటీవలకాలంలో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. దాంతో రేపటి రోజున అవి ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటాయోనని గత కొన్ని నెలల నుంచి మార్కెటింగ్ ఉన్నతాధికారులు లైసెన్సుల అంశాన్ని పెండింగ్‌లో పెడుతున్నారు. అయితే లేఖలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు మాత్రం లైసెన్సులను ఏమి చేశారని పదేపదే ప్రశ్నిస్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి అధికారులకు నెలకొన్నది.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు ఆదేశాలు



కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు , అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్న దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని గుంటూరు జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్‌డీఏ కమిషనర్ కె కన్నబాబు ఆదేశించారు. గురువారం గుంటూరు కలక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో ఆయన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి సీఆర్డీఏ పరిధిలో నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన కొలువుదీరే సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ఇతర విభాగాలు పనుల పునఃప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. సీఆర్డీఏ పరిధిలో చేపట్టనున్న నిర్మాణాలకు వచ్చే కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, ఆసాంఘిక శక్తుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించే విధంగా పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగినపుడు వైద్యులను, అంబులెన్స్, మందులు అందుబాటులో వుంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. రాజధాని పరిధిలో వున్న పీహెచ్సీని 30 పడకల ఆసుపత్రిగా అప్డేట్ చేయడం జరిగిందని, కార్మికులకు అవసరమైన వైద్య చికిత్స అందించడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి కమిషనర్‌కు తెలిపారు. నిర్మాణ పనులకు కార్మికులు కుటుంబాలతో పనులకు వస్తారు. కాబట్టి వారి కుటుంబాలలోని చదువుకునే పిల్లలను దగ్గరలోని స్కూల్స్‌లో, పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ పీడీ, డీఈవోకి సూచించారు. నిర్మాణ రంగానికి సంబంధించి కాంట్రాక్టర్ల నియామకం ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు చట్టపరంగా అందించవలసిన సౌకర్యాలపై దృష్టి పెట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. నిర్మాణ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ చక్కగా చేపట్టాలని డీపీవోకు సూచించారు. స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు కాంట్రాక్టర్లతో మాట్లాడి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరమైన మెటీరియల్ అందేలా భూగర్భ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీఈవో రేణుక, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస రెడ్డి, డీపీవో నాగసాయి కుమార్, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవి, మైనింగ్ ఆర్ఐ లావణ్య, ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైళ్లలో ఆన్‌బోర్డు ఏటీఎంలు

● కోచ్ వర్కుషాపుల్లో సిద్ధమవుతున్న భోగీలు

● రైలు ప్రయాణంలో నగదుకు ఇక ఢోకా లేనట్లే



ఆన్‌బోర్డు ఏటీఎం

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించుకొనే ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్(ఏటీఎం)లను రైలు భోగీల్లో ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో రైలుకు ఒక ఏటీఎంని ఇన్‌స్టాల్ చేసేందుకు చర్యలు చేపట్టింది. రైలు కోచ్‌లు తయారు అయ్యే వర్కుషాపుల్లో ప్రస్తుతం వీటిని అమరుస్తున్నది. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లలో ఆన్‌బోర్డు ఏటీఎంలను అమర్చి వాటికి ప్రయాణీకుల నుంచి లభించే స్పందన ఆధారంగా మరిన్ని రైళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఇప్పటికే ఏటీఎంలను అమరుస్తున్న వీడియో క్లిప్పింగులను ఆ శాఖ విడుదల చేయడంతో ఎప్పుడెప్పుడు రైళ్లలో ఏటీఎంల సేవలు అందుబాటులోకి వస్తాయానని ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు.

ఇప్పటివరకు రైల్వేస్టేషన్ల ఆవరణల్లో మాత్రమే వివిధ బ్యాంకుల ఏటీఎంలు అందుబాటులో ఉన్నాయి. అయితే అవి కొన్ని సందర్భాల్లో పని చేయకపోతుండటంతో నగదు కోసం ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. యూపీఐ యాప్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ ఫిజికల్‌గా నగదు చేతిలో లేకపోతే ప్రయాణీకులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఆన్‌బోర్డు ఫుడ్ సర్వీసెస్ పొందాలంటే తప్పక నగదు చేతిలో ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రయాణీకుల అవసరాలను గుర్తించిన రైల్వే శాఖ ఏటీఎంలను అమర్చేందుకు భోగీలలో అవసరమైన ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నది.

ఆన్‌బోర్డు ఏటీఎంలు ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తే అన్నిరకాల సేవలు పొందవచ్చు. నగదు ఉపసంహరణ, బ్యాంకు అకౌంట్ నుంచి మరో బ్యాంకు ఖాతాకు క్యాష్ ట్రాన్స్‌ఫర్, ఏటీఎం కార్డుల పిన్ ఛేంజ్, గ్రీన్‌పిన్ జనరేట్ చేయడం, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం వంటి అన్ని సేవలు రైలులో ప్రయాణిస్తూనే పొందవచ్చు. ఏటీఎం ఏర్పాటు వలన రైల్వేకు కూడా ఆదాయం సమకూరుతుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

చికిత్స పొందుతూ..

బాపట్ల జంట మృతి



బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న సంఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నల్లమోతు మాధవి బుధవారం మృతి చెందగా ఆమెతోపాటు తీవ్రంగా గాయపడిన తులాబందుల లక్ష్మీ నారాయణరావు గురువారం మృతి చెందారు. గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మాధవి మృతి చెందగా హైదరాబాద్ ఆపోలో హాస్పటల్‌లో లక్ష్మీనారాయణరావు మృతి చెందారు. వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వీరిని లక్ష్మీనారాయణరావు భార్య తిట్టిందని మనస్థాపంతో బాపట్ల రైల్వేస్టేషన్ దగ్గర పెట్రోల్ పోసుకొని తీవ్రంగా గాయపడిన ఇద్దరు కన్నుమూశారు. విజయలక్ష్మీపురంకు చెందిన నల్లమోతు మాధవి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేట్ రిజర్వేషన్ కౌంటర్ నడుపుకుంటున్న రిటైర్డ్ రైల్వేఉద్యోగి లక్ష్మీ నారాయణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ క్షణికావేశంలో పెట్రోల్ పోసుకొని నిప్పుపెట్టుకొని ఈవిధంగా ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు.

యోగ టీచర్ ఉద్యోగాల పేరుతో మోసం

బుద్ధ యోగ ఫౌండేషన్ నిర్వాహకుడిపై ఫిర్యాదు

ఎస్పీ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బాధితుల ధర్నా



ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యదర్శి వలి, బాధితురాలు సునీత తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో యోగా టీచర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి గుంటూరుకు చెందిన బుద్ధ యోగ సెంటర్ నిర్వాహకుడు వలి తమను మోసం చేశాడని పలువురు బాధితులు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించడానికి యోగ టీచర్లను నియమించి విద్యార్థులల్లో ఒత్తిడి తగ్గేలా చర్యలు తీసుకోనుందని, దానికి గాను తమ సంస్థకు నియామక ఉత్తర్వులు ఇచ్చారని వలి తెలిపారు. ఆయుష్ డిపార్ట్ మెంట్ ద్వారా అనుమతి వచ్చిందని, 2022 సంవత్సరంలో గుంటూరుకు చెందిన ఫౌండేషన్ నిర్వాహకుడు సయ్యద్ వలి యోగా వాలంటీర్లు కావాలని ఇచ్చిన ప్రకటనకు, చాలా మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి దాదాపు 2 నెలలు యోగా శిక్షణ ఇచ్చి, యోగా సర్టిఫికేట్ ఇచ్చి విద్యా కమీషనర్ ద్వారా ఉచిత పొరుగు సేవలపై జీఓ జిల్లా, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రొసీడింగ్ ఆర్డర్స్ జారీ చేయించినట్లు ఆయా పత్రాలు చూపాడన్నారు. యోగా సర్టిఫికెట్ పొందిన వారికి యోగా ఇన్స్ట్రక్టర్ మరియు యోగా అసిస్టెంట్స్‌గా ప్రభుత్వ పాఠశాలలో నియమించాడన్నారు. వీరికి నమ్మకం కుదిరేందుకు అతి కొద్ది మందికి రెండు నెలలు తానే జీతాలు ఇచ్చాడన్నారు. మొదట 34 వేలు జీతం అని ఆశ చూపి. తర్వాత 25 వేలు ఇస్తామని చెప్పి. విడతల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1400 మందికి పైగా పాఠశాలల్లో నియమించారన్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా ఆయా ఉద్యోగాలు ప్రభుత్వ పరం చేస్తామని ఆశ చూపి ప్రస్తుతం జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. ఇందుకు గాను ఒక్కొక్కరి వద్ద లక్షల రూపాయలు వసూలు చేసాడన్నారు. 5-6 నెలలు 17 వేలు చొప్పున కొద్ది మంది ఖాతాల్లో జీతం జమ చేసి. మిగిలింది పీఎఫ్, హెచ్ఆర్ఏ అని నమ్మించాడన్నారు. పీఎఫ్ ఖాతాలు ఎవరికీ తెరవలేదన్నారు. 14 నెలల నుండి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఫౌండేషన్ నిర్వాహకుడు వలిపై చర్యలు తీసుకుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,58,818 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,39,333 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,58,818 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 57,411 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12300
నంబరు.5	10000	12600	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10000	13500	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

రాష్ట్రస్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల సాహితీభారతి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవితల పోటీలకు ఆహ్వానిస్తున్నామని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ తెలిపారు. రచయితలు, కవులు ఇతి వృత్తం ఏదైనా తమ కవితలను అర ఠావుకు మించకుండా రాసి హామీపత్రం జతపరిచి మే నెల 5వ తేదీలోగా పంపాలన్నారు. కవితల పోటీలలో విజేతలైన రచయితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. పంపించాల్సిన చిరునామా ఆదంషఫి రచయిత కోశాధికారి, జమేదారు పేట, బాపట్ల -522101, బాపట్ల జిల్లా అను చిరునామాకు పంపాలని తెలియజేశారు.

బధిరుల ఆశ్రమపాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తుల స్వీకరణ

బాపట్లరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2025-2026 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీఎస్ రజియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్ ఉందని రాష్ట్రంలోనే అన్ని జిల్లాల వారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులు అన్నారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరన్ సర్టిఫికెట్, పాఠశాల బదిలీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజి జిరాక్స్ కాపీతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఆసక్తి గల మూగ, చెవిటి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగునాటక రంగ దినోత్సవంలో మంత్రి దుర్గేష్ నుంచి పురస్కారం అందుకుంటున్న రేపల్లెకు చెందిన పోలూరు సుబ్బారావు **(రేపల్లె)**

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

వేమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పిల్లి మనోజ్, సంధ్యారాణిల కుమార్తె లారాస మొదటి జన్మదినాన్ని పురస్కరించుకుని వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేశారు. రూ.50 వేల వ్యయంతో బలిజేపల్లి, చంపాడు, రావికంపాడు, బేతేలుపురంనకు చెందిన పది మంది విద్యార్థులకు దాతల తరుపున పిల్లి ఆంజనేయప్రసాద్, దేవరపల్లి డేవిడ్ రాజ్ చేతుల మీదగా సైకిళ్లు అందజేశారు.

వేసవి కోచింగ్ శిబిరాలకు దరఖాస్తు చేసుకోవాలి

● జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కోచింగ్ శిబిరాల నిర్వహణకు ఆసక్తియున్న పీడీ, పీఈటి, క్రీడా అసోసియేషన్ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు. శాప్ ఆదేశాల మేరకు ఈ శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 2025-2026 సంవత్సరానికి జిల్లాలో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ధరఖాస్తులను జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

తేనెటీగల దాడి..

ఒకరి పరిస్థితి ఆందోళనకరం

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంకరోడ్డులోని గాయత్రి అపార్ట్‌మెంట్ వద్ద గురువారం సాయంత్రం తేనెటీగలు దాడిచేశాయి. 15మందిని తేనెటీగలు కుట్టగా 14మంది ఏరియా వైద్యశాలలో చేరారు. రాత్రి వరకు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ ఆధ్వర్యంలో చికిత్స అందించి 13మందిని పంపించారు. ఎన్ సతీష్‌ను ఎక్కువ తేనెటీగలు కుట్టటంతో వాంతులవుతున్నాయి. దీంతో అతడిని ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే అనేక సార్లు అదే మార్గంలో తేనెటీగలు దాడిచేశాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి
● లక్షటన్నుల ఇసుకను సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, ఇసుక రవాణా, స్వచ్ఛాంధ్ర, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాల కోసం చీరాల, రేపల్లె డివిజన్‌లలో భూసేకరణ చేపట్టాలన్నారు. రుతుపవనాలు రాకముందు ప్రజలకు ఇసుక కొరత లేకుండా ముందుస్తుగా లక్ష టన్నుల ఇసుకను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం గాజులంక-1 ఇసుక రీచ్ నుంచి ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. గాజులంక-2 ఇసుక రీచ్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. జవ్వుల దిన్నె ఇసుక రీచ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా కృష్ణా-పశ్చిమ కాల్వల ద్వారా తాగునీటి ట్యాంక్‌లను నీటితో నింపుకోవాలని అధికారులను ఆదేశించారు. బాపట్లకు తాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకానికి కృష్ణా-పశ్చిమ కాల్వ ద్వారా నీటిని నింపుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలో జరిగిన ఎంఎస్ఎంఈ సర్వే రీవాల్యూడేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెన్షన్లు పంపిణీలో మూడుసార్లు ఫిర్యాదులు వచ్చాయని సిబ్బందిని పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులకు చెప్పారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, పౌరసరఫరాల జిల్లా అధికారి ఈబీ విలియమ్స్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ సొసైటీ బకాయి రూ.కోటి73వేలు చెల్లింపు

● పెరిగిన పురపాలక సంఘ ఆదాయం
● పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి..
● రాయితీపై విస్తృత ప్రచారం

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘానికి సంబంధించిన ఆర్థిక వనరులను మెరుగుపర్చుకోవటంలో భాగంగా మున్సిపల్ అధికారులు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి వార్డులలో పర్యటించి మొండి బకాయిలు వసూలు చేస్తున్నారు. అందులో భాగంగా మార్చి 31 వరకు రూ.7కోట్ల 93లక్షల పన్ను వసూలు చేయాల్సి ఉండగా అందులో రూ.6కోట్ల50లక్షలు వసూలు చేశారు. మిగిలిన మొత్తంలో ఎక్కువశాతం ఎరియర్ బిల్లులు మాత్రమే ఉన్నాయి. బాపట్ల ఎడ్యుకేషన్‌సొసైటీ 17అసెస్‌మెంట్‌లకు సంబంధించి రూ.కోటి 73వేల బకాయి ఉంది. దీంతో కమిషనర్ వారికి జప్తునోటీసు జారీ చేయటంతో ఎట్టకేలకు గురువారం బకాయి మొత్తాన్ని చెక్కురూపంలో అందజేశారు. పురపాలక సంఘానికి ఎడ్యుకేషన్ సొసైటీ నుంచి ఏడాదికి రూ.40లక్షల పన్ను చెల్లించాల్సి ఉంటుందని మొత్తాన్ని ఒకేసారి చెల్లించారని కమిషనర్ తెలిపారు. అదే విధంగా వడ్డీపై 50శాతం రాయితీ ప్రకటించటంతో ఎక్కువ మంది పన్ను చెల్లించటానికి ముందుకొచ్చారు. మార్చి తర్వాత కూడా వడ్డీపై 50శాతం రాయితీ నెలాఖరి వరకు ప్రకటించటంతో కొంతమంది పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వెట్టి చాకిరిలో మగ్గుతున్న కుటుంబాలకు విముక్తి కల్పించాలి

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు

భట్టిప్రోలు, (కొల్లూరు) ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వెట్టి చాకిరిలో మగ్గుతున్న కుటుంబాలకు విముక్తి కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లె రూరల్ మండలం బొబ్బర్లంక ఎస్టీ కాలనీకి చెందిన నంబూరి పద్మ దంపతులు 15 సంవత్సరాల క్రితం ఎలిసెటిదిబ్బ గ్రామానికి వలస వెళ్లగా ఆ గ్రామానికి చెందిన చెన్ను కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఏగేసు, అశ్వేశ్వరరావులు సుమారు 50 కుటుంబాల వారితో వెట్టిచాకిరి చేయించుకోవడంతో పాటు మనుషులను కూడా విక్రయించి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఆయా కుటుంబాల వారిని ఎలిసెటిదిబ్బలో నిర్బంధించడంతో పాటు తమ మాట వినకపోతే శారీరక హింసలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1976లో వెట్టిచాకిరి వ్యవస్థ రద్దయి చట్టం ఏర్పడినప్పటికీ ఆచరణలో అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఎలిసెటిదిబ్బలో వెట్టి చాకిరీ చేయిస్తున్న వ్యక్తులపై సమగ్ర విచారణ చేపట్టి వారి ఆధీనంలో ఉన్న కుటుంబాల వారికి విముక్తి కలిగించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సీపీఐ కార్యదర్శులు జి.బాలాజీ, శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా అత్యవసర చర్యలు తీసుకోవాలి

భట్టిప్రోలు(కొల్లూరు) ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని ఎంపీపీ లలితకుమారి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ, మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు వాటి అమలు గురించి సర్పంచులు, ఎంపీటీసీలకు సమాచారం అధికారులు ఇవ్వాలని సూచించారు. జనవరి నుంచి ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, వేతనాలు ఆలస్యానికి గల కారణాలు ఆ శాఖాధికారులను ప్రశ్నించారు. ఈ నెలాఖరుకు కూలీల ఖాతాలలో జమవుతాయని ఏపీవో సమాధానం ఇచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఎంపీడీవో వెంకటరమణ, వైస్ ఎంపీపీ పిచ్చయ్యశాస్త్రి, డిప్యూటీ ఎంపీడీవో ఊహారాణి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలతో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి

వేమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామసభల ద్వారా ప్రణాళికబద్ధమైన అభివృద్ధిని సాధించే అవకాశం ఉంటుందని చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చావలి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కొన్ని చట్టపరమైన అంశాలను పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచారన్నారు. గ్రామసభల్లో వాటిని సభ్యులకు వివరించాలన్నారు. కార్యదర్శి మాట్లాడుతూ సభ ద్వారా ఆర్థిక స్థితిగతులు అభివృద్ధికి సంబంధించిన అంశాలను అలాగే పంచాయతీరాజ్‌కు చెందిన ఆస్తులు, బడ్జెట్ తదితర వివరాలు, విషయాలను సభకు హాజరైన ప్రజలకు వివరించారు. సభలో రెండు సచివాలయాల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛరేపల్లెగా తీర్చిదిద్దుదాం : మున్సిపల్ కమిషనర్



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ పారిశుధ్య కార్మికులు

రేపల్లె, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కెసాంబశివరావు అన్నారు. గురువారం పురపాకల సంఘ కార్యాలయం నందు తహసీల్దార్ కార్యాలయం వరకు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, సబ్‌రిజిస్ట్రార్, ట్రెజరీ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే చర్యలు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సారా తయారు చేసినా.. విక్రయించినా.. అక్రమ రవాణాకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, రూరల్ పోలీసులు గురువారం స్టూవర్టుపురం, బేతపూడి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి.గీతిక, రూరల్ సీఐ హరికృష్ణ, వెదుళ్ళపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ పి.భాగ్యరాజు, బాపట్ల ఎక్సైజ్ ఎస్ఐలు డి.ప్రభుదాసు, ఎస్.మౌలిక, వీఆర్వోలు విజయలక్ష్మీ, వలిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఉపాధి అవకాశాలు



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ

నగరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ తీరప్రాంతంలో పేద విద్యార్థులకు ఎస్వీఆర్ఎం కళాశాల అందుబాటులో ఉంటుందని కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం మెగాజాబ్‌మేళాను కళాశాలలో దివీస్ ల్యాబరేటరీ హైదరాబాద్ వారు ఇంటర్వ్యూ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం కళాశాల నుంచి గాని ఇతరప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ, యువకులు సుమారు 80మంది హాజరుకాగా దీనిలో 25మంది యువతీ, యువకులను ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపిక చేసిన హెచ్‌ఆర్ రామకృష్ణను కళాశాల కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, అకాడమి డైరెక్టర్ పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా 9 గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

● రూ.51 లక్షలతో 11 ట్రాన్స్‌ఫార్మర్లు : ట్రాన్స్‌కో ఏఈ గోపి

వేమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మండల ట్రాన్స్ కో ఏఈ గోపి తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 9 గ్రామాల్లో 51 లక్షల వ్యయంతో 11 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎస్టీ కాలనీలో ఆరు లక్షలతో 63 కేవీ, ఇదే గ్రామంలో చావలి రోడ్డులో రూ. 10 లక్షలతో 100 కేవీ, పెరవలిలో రూ.6 లక్షలతో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు, పెరవలిపాలెంలో రూ.6 లక్షలతో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 20 కొత్త పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. చావలిలో రూ.3 లక్షలతో 16 కేవీ, బలిజేపల్లిలో రూ.3 లక్షలతో 16 కేవీ, కుచ్చెళ్లపాడులో రూ.6 లక్షలతో 16 కి.మీ కాకర్లమూడిలో రూ.6 లక్షలతో రెండు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కాకర్లమూడి గ్రామంలో అగ్రికల్చర్ ఫీడర్ నుంచి గృహ వినియోగారులకు విద్యుత్ సరఫరా కావడం వల్ల విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఏర్పడుతోందని ఆ సమస్యను తొలగించేందుకు రూ.5 లక్షలతో కొత్త లైన్ ఏర్పాటు చేస్తూ తెనాలి నుంచి ఈ ప్రాంతంలో ఉన్న ప్రధాన లైన్ల ద్వారా సరఫరా ఇచ్చేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు

● బాపట్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి

బాపట్లరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మైక్‌చేతిలో ఉందికదా అని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదని బాపట్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మపై విమర్శలు చేయటం మానుకొని మీపార్టీకి దూరమైన ఓటర్లను దగ్గర చేసుకునేందుకు ప్రయత్నించాలని హితబోధ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన జశ్వంత్‌రెడ్డి విగ్రహాన్ని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పట్టణంలో ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకున్న ఘనత కోన రఘుపతికే దక్కుతుందన్నారు. రెడ్డి సామాజికవర్గాన్ని నియోజకవర్గంలో అణిచివేయటానికి పాల్పడింది మీరుకాదా అని ప్రశ్నించారు? తెలుగుదేశంపార్టీ విజయం కోసం 9 సంవత్సరాలు కష్టపడి పని చేశారని అటువంటి వ్యక్తికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తానికొండ దయాబాబు, నాగభూషణం, యలమంద, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభూత కల్పనతో అసత్య ప్రచారం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరబాబు

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో గోమరణాలపై వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి అభూత కల్పనతో అసత్య ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు తెలిపారు. ఈ విషయమై బాపట్ల టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమౌతుందన్నారు. అయితే దీనిని వక్రీకరించి కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు

బాపట్ల,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాలలో బాపట్ల పట్టణంలోని సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి గురువారం కళాశాలలో సర్టిఫికెట్‌లు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో వెలగపూడి సుబ్బారావు, సరస్వతమ్మల పేరిట మెడల్స్‌ను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.దుర్గాప్రసాదరావు, అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అధ్యాపకులు సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు హాకీ క్రీడా పరికరాల అందజేత

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చెరువుజమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామపెద్ద పువ్వాడ ఏకాంబరేశ్వరరావు రూ.35వేల విలువ చేసే క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. పాఠశాల విద్యార్థులు హాకీలో రాణించటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు, పెద్దలు కలిసి ఏకాంబరేశ్వరరావును ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, పీఈటీ బోయన వీరచంద్ర, గ్రామ పెద్ద పువ్వాడ బసంత్‌కుమార్, ఉపాధ్యాయులు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీపోలేరమ్మ ఉత్సవాలు

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీబీసీరోడ్డులో ఉన్న బాపట్ల అధిష్టాన దేవత శ్రీపోలేరమ్మవారి ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్నాయి.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

కొల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ తెలిపారు. గురువారం కొల్లూరులోని మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించాయన్నారు. దోనేపూడి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు నిమ్మగడ్డ రామచంద్రయ్య ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను వివరించి సమావేశంలో పాలు పంచుకున్నారు. అనంతరం ఆయనను వ్యవసాయాధికారులు పూలమాలలతో సత్కరించారు. సమావేశంలో డీపీఎం వాణిశ్రీ, ఏడీఏ విజయబాబు, ఏపీఎం రాము, ఏవో వెంకటేశ్వరరావు, సతీష్‌బాబు, కృష్ణ, శివనాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ నింపేందుకు మోటర్ల ఏర్పాటు

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా ఉండేందుకు సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను పూర్తి స్థాయి నీటితో నింపేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. గురువారం సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించిన కమిషనర్ అక్కడ ఏర్పాట్లు గురించి తెలుసుకున్నారు. పురపాలక సంఘానికి సంబంధించి 40హెచ్‌పీ మోటర్లు 2 ఉన్నాయని 10హెచ్‌పీ మోటర్లు 2 ఉన్నాయని ఏఈ ప్రసాద్ తెలిపారు. దీంతో 50హెచ్‌పీ ఇంజన్లు2, 40హెచ్‌పీ ఇంజన్లు 2, 15హెచ్‌పీ ఇంజన్ల 2చొప్పున అద్దెకు తీసుకొచ్చి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రానికి పిటిఛానల్‌కు నీరు వస్తుందని మూడురోజుల్లో చెరువును 24అడుగులు నింపేవిధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్‌పై శిక్షణ

కర్లపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నిపంచాయతీల సర్పంచ్‌లు, అధికారులు, ప్రజలు పరిసరాల శుభ్రతపై శ్రద్ధ వహించాలని దమ్మనవారిపాలెం సర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని దమ్మనవారిపాలెంలో స్థానిక శిక్షణ కేంద్రంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్‌లో భాగంగా పరిసరాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు విషయాలు తెలిపారు. మండలంలోని 11 గ్రామాల కార్యదర్శులు, క్రాప్‌మిత్రలు,షెడ్‌మిత్రలు పాల్గొనగా ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయిద్దాం.. ఎరువుల వాడకం తగ్గిద్దాం

చెరుకుపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి నమూనాలను సేకరించి భూసారపరీక్షలు చేస్తున్నట్లు ఏవో టి.బాలాజీ గంగాధర్ తెలియజేశారు. ఆసక్తి గల రైతులు రైతుసేవాకేంద్రాలకు వెళ్లి వీఏఏలను సంప్రదించాలని తెలిపారు. నేలలోని భూసారాన్ని తెలుసుకోవడం వల్ల ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు తగ్గించుకుంటూ సుస్థిర దిగుబడులు పొందవచ్చన్నారు.









ఇక సరికొత్తగొల్లపాలెం!

● సీఎం పర్యటనతో మారుతున్న రూపురేఖలు
● స్వర్ణ గ్రామం కావాలంటూ పిలుపు
● పీ4 విధానంతో 33 కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగు
● వేగంగా హామీల అమలుకు యంత్రాంగం కసరత్తు
● గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.3.67 కోట్ల నిధుల విడుదల
● నోడల్ అధికారిగా డీఆర్డీఏ పీడీ నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కొత్తగొల్లపాలెంను మోడల్ విలేజ్‌గా తిర్చిదిద్దేందుకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. మారుమూల ఉండే ఈ గ్రామాన్ని పింఛన్ల పంపిణీ వేదికగా చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు అక్కడి ప్రజల సాదకబాధలు సావధానంగా విన్నారు. అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. జీవనోపాధి నుంచి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ వరకు అన్ని విషయాలపై గ్రామస్తులతో చర్చించారు. ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీకోసం సీఎం పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామంపై సీఎం వరాలజల్లు కురిపించారు. వాటి అమలుకు కలెక్టర్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ప్రజావేదిక సభలో సీఎం ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4లో భాగంగా గ్రామంలోని 33 నిరుపేద కుటుంబాలను మార్గదర్శకుల చేతిలో పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సీఎం హామీల అమలు, చేపట్టాల్సిన పనులు, సంక్షేమ పథకాల విషయంలో కలెక్టర్ వెంకటమురళి సారథ్యంలో ఓ దఫా సమీక్ష జరిగింది. అంశాల వారీగా జాబితాను అధికారులు సిద్ధం చేసుకున్నారు. తొలి దశలో గ్రామాభివృద్ధికి రూ.30లక్షల నిధుల విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. క్రమం తప్పకుండా వాటిపై సమీక్షలు జరపడంతో ఏటీఆర్‌ను కూడా యాక్షన్‌ప్లాన్‌లో భాగం చేసుకోనున్నారు. కొత్తగొల్లపాలెంలో పీ4 అమలుకు సంబంధించి డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావును నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

గ్రామంలో గుర్తించిన ప్రజా సమస్యలు

గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని 17 కుటుంబాలను అధికారులు గుర్తించారు. సొంతిల్లు లేని 13 కుటుంబాలకు నివాసయోగ్యం కల్పించే బాధ్యతను హౌసింగ్ పీడీకి అప్పగించారు. 30 మందికి పింఛన్లు, ఒకరికి రేషన్ కార్డు, విద్యుత్ కనెక్షన్లు 4, వివిధ దశల్లో ఆగిన ఇళ్లు నాలుగింటిని గుర్తించారు. ఏడుగురికి బీసీ కార్పొరేషన్ రుణాలు, మరో ఏడుగురికి సదరన్ సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. గ్రామ జనాభానే 904 కాగా, సీఎం పర్యటన తర్వాత వివిధ పథకాల ద్వారా దాదాపు 95 కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా పీ4 అర్హత కుటుంబాల సంఖ్య అదనం.

గ్రామాభివృద్ధి ఇలా..

గ్రామంలోని శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్లు, పబ్లిక్ కొళాయిల ద్వారా సమృద్ధిగా తాగునీరు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం, రామాలయం పూజారికి ఇచ్చిన హామీ, గ్రామం మొత్తం ఫైబర్ నెట్ సౌకర్యం, కేజీబీవీని అందుబాటులోకి తేవడం సీఎం ఇచ్చిన హామీలలో ముఖ్యంగా ఉన్నాయి. వీటికి చాలావరకు అధికారులు ప్రతిపాదనలతో పాటు ఎస్టిమేషన్ వ్యయాన్ని సిద్ధం చేశారు. త్వరలోనే వీటన్నింటిని పట్టాలెక్కించే విధంగా కసరత్తు చేస్తున్నారు.

పీ4 అమలుకు నివేదిక

పీ4 కార్యక్రమం అమలులో భాగంగా కొత్తగొల్లపాలెంలోని నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తెస్తామని సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వ సర్వేలో 33 కుటుంబాలు ఈ కార్యక్రమానికి అర్హులని గుర్తించారు. సదరు కుటుంబాల అవసరాలేంటి, ఏ స్థాయిలో వాటిని భర్తీ చేస్తే ఆర్థికంగా వారు నిలదొక్కుకోగలరు అనే అంశాలపై నివేదిక ఇవ్వడానికి డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును నోడల్ అధికారిగా కలెక్టర్ నియమించారు. పీడీ శిక్షణ నిమిత్తం వారంరోజుల సెలవులో ఉండడంతో ఆయన రాగానే పీ4 కార్యక్రమం ఊపందుకోనుంది. నివేదిక విషయలో ఓ అంచనాకు వచ్చిన యంత్రాంగం దాని ఆధారంగా మార్గదర్శకులతో చర్చించి, పీ4కు తుదిరూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

నెలన్నరలో పరిష్కారం

మొత్తం హామీలను వివిధ శాఖలకు అప్పగించడంపై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. ఆయా పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చడంలో సాంకేతిక చిక్కులను తొలగించడంపై యంత్రాంగం దృష్టిపెట్టింది. సీఎం కోరుకున్నట్లు నెలన్నర వ్యవధిలోనే కొత్తగొల్లపాలెం గ్రామం రూపురేఖలు మార్చడంతో పాటు గ్రామస్తులు అన్ని విధాల ఆదుకునే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి.


కొత్తగొల్లపాలెం గ్రామస్థుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు (ఫైల్)


ఎం.వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలి

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మే నెలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత కోరారు. ఈ మేరకు గురువారం అమరావతి రోడ్డులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ ఎం.వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం లలిత మాట్లాడుతూ టేక్ హోం రేషన్‌తో వేసవి సెలవులు ఇస్తే పిల్లలకు మంచిదనే తల్లితండ్రుల అభిప్రాయాలను పరిగణనలో తీసుకోవాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చేందుకు జీవో విడుదల చేయలేదని, కొత్త బాల సంజీవని 2.0 సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సారమ్మ, వాణిశ్రీ, అరుణ తదితరులు ఉన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలి

● ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య


మాట్లాడుతున్న ఆర్ లక్ష్మయ్య, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికుల రక్షణ కోసం సామాజిక సంక్షేమ చట్టం తీసుకురావాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. లక్ష్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర 65 డాలర్లు ఉంటే దేశంలో డీజిల్ లీటర్ ధర రూ.33లు ఉండాలని, అందుకు భిన్నంగా రూ.100 ఉందని పేర్కొన్నారు. దీంతో రవాణా కార్మికులపై భారం పడుతోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు టోల్‌గేట్లు అప్పగించడంతో వాటిపై పర్యవేక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. వీటిని ఐక్యంగా తిప్పికొట్టేందుకు మే 20 జరిగే సార్వత్రిక సమ్మెలో రవాణా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో పదివేల రూపాయలు ఇచ్చినట్లే ఇచ్చి మరో చేతితో లాక్కుందని దుయ్యబట్టారు. సమావేశంలో కె.దుర్గారావు, సురేష్, పోలినాయుడు, కె.నాగేశ్వరరావు, బి.లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, మస్తాన్ వలి, ఎం.హరిపోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు పునరుద్ధరించాలి

● ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి లుక్సన్

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చైల్డ్ కేర్ లీవ్‌లు ఇవ్వాలని, గ్యారేజీలలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 ను అమలు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నబ్బాయి, నాయకులు డీవీ శంకరరావు, అమరనాథ్, పీఎస్ రావు, ఎస్‌వీ రావు, ఎన్‌వీ రెడ్డి, మహిళా ఉద్యోగులు ఉన్నారు.

..ఇక రయ్ రయ్

(5వ పేజీ తరువాయి)

కేటాయించింది. స్వదేశీ దర్శన్- 2.0 కింద బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.97.52 కోట్లు కేటాయించింది. దీనికి తోడు ఇప్పటికే బాపట్ల జిల్లాగా మారడం, ఎన్‌హెచ్-216 జాతీయ రహదారి బాపట్ల గుండా వెళుతుండడంతో కనెక్టివిటీ పెరిగింది. ఈ నేపథ్యలో బాపట్ల నుంచి గుంటూరు, రాజధానికి మధ్య రాకపోకలు బాగా పెరిగాయి. ఈ అవసరాలను ప్రస్తుతం ఉన్న గుంటూరు- చీరాల రోడ్డు తీర్చలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆ రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించాలన్న ప్రతిపాదనలు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ రోడ్డును నాలుగు వరసల రోడ్డుగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు గుంటూరు-పర్చూరు రోడ్డును కూడా నాగులుప్పలపాడు వరకు నాలుగు రోడ్లుగా విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుంటూరు- పర్చూరు- ఒంగోలు- నెల్లూరు మీదగా వెళ్లే ఈ రోడ్డును గతంలో పాత మద్రాసు రోడ్డు అని పిలచేవారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు పర్చూరు వద్ద నకిరేకల్లు- ఓడరేవు జాతీయ రహదారి కూడా అనుసంధానం అవుతోంది. దీంతో ఆ రోడ్డుపై కూడా రద్దీ పెరిగింది. ఆ రోడ్డు గుంటూరు- ప్రత్తిపాడు- పెదనందిపాడు- పర్చూరు- ఇంకొల్లు మీదగా 84.5 కి.మీ వెళ్లి నాగులుప్పలపాడు వద్ద ఒంగోలు- దిగమర్రు జాతీయ రహదారి ఎన్‌హెచ్-216లో కలుస్తుంది. దీంతో గుంటూరు- నాగులుప్పలపాడు మధ్య కూడా ఈ రోడ్డును నాలుగు రోడ్లుగా విస్తరించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు రోడ్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇస్తే ఆ రెండు రోడ్లు కూడా నాలుగు రోడ్లుగా విస్తరిస్తారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

డాలర్ డ్రీమ్స్ ఢమాల్



● ఉన్నత చదువుల కోసం విదేశాలకు విద్యార్థులు
● పార్ట్‌టైం జాబ్స్‌కు నెలకొన్న తీవ్ర పోటీ
● నెలవారీ ఖర్చులకు తల్లిదండ్రులే ఆధారం
● వీసా స్పాన్సర్ చేసే కంపెనీల్లో ఉద్యోగం ప్రశ్నార్థకం

● నగరంలోని బ్రాడీపేటకు చెందిన ఒక వాచ్‌మెన్ తన కుమార్తెని సంపన్నురాలుగా చూడాలని సర్వం ధారపోసి మూడేళ్ల క్రితం అమెరికాలోని డల్లాస్‌కు పంపించారు. రెండేళ్లలో చదువు పూర్తి అయినా నేటికీ ఆమెకు హెచ్1బీ వీసా స్పాన్సర్ చేసే కంపెనీలో ఉద్యోగం లభించలేదు. దీంతో పార్ట్‌టైం జాబ్ లోనే కొనసాగుతోంది. మరో ఆరు నెలల్లో వీసా రాకపోతే స్వదేశానికి రావాల్సిందే.

● స్థానిక శ్రీనివాసరావు పేటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆస్తినంతా బ్యాంకులో తనఖా పెట్టి కొడుకుని యూకే పంపించారు. అక్కడ కనీసం పార్ట్‌టైం జాబ్ కూడా దొరకడం లేదు.

● స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల పరిసర ప్రాంతానికి చెందిన ఒక టైలర్ తన కొడుకుని యూఎస్‌లో ఎంఎస్ చేసేందుకు పంపించారు. చదువు అయిపోయి ఏడాది గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. దీంతో ఇక్కడినుంచి ప్రతినెలా డబ్బులు పంపుతూ ఆర్థికంగా చితికి పోతున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో చదువుకుని ఉద్యోగం సాధించాలన్న స్వదేశీ విద్యార్థుల కలలు కల్లలవుతున్నాయి. డాలర్ల ఆశలో ఏటా లక్షల సంఖ్యలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడా, యూకే వెళ్తున్నారు. అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకొంటూనే యూనివర్సిటీల ఫీజులు, నెలవారీ ఖర్చులు సమకూర్చుకోవచ్చని ఇక్కడే ప్లానింగ్ చేసుకుంటున్నారు. అయితే ఆయా దేశాల్లో అడుగు పెట్టిన తర్వాత కాని అసలు విషయం వారికి బోధపడటం లేదు. చదువు అయిపోయాక వీసా స్పాన్సర్ చేసే కంపెనీల మాట పక్కన పెడితే.. అసలు అక్కడ జీవించడానికి, రూమ్ అద్దె చెల్లించడానికి పార్ట్‌టైం ఉద్యోగాలకు కూడా ఎగబడాల్సిన పరిస్థితి నెలకొంది. వేర్‌హౌస్‌లలో ప్యాకింగ్, రవాణ వాహనాల్లోకి ప్యాక్ చేసిన వస్తువుల లోడింగ్, కేకులు, బ్రెడ్‌లు సప్లై చేయడం వంటి పనులకు పోటీ నెలకొంది. అక్కడ క్లీనింగ్, వంటగదుల్లో పని చేయడానికి మాత్రమే కాస్తో..కూస్తో పార్ట్‌టైం జాబ్స్ దొరుకుతున్నాయి. ఈ పనులు చేయలేక ప్రతి నెలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి, నెల అద్దె రూ.30వేలు, తిండి, ట్రాన్స్‌పోర్టు ఇతరత్రా ఖర్చులకు రూ. 30 వేలు కలిపి రూ.60 వేలు వరకు పంపించమని కోరుతున్నారు.

మధ్యతరగతి ఆశలు..

ఎంఎస్ చేసేందుకు విదేశాలకు తమ పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులు మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన వాళ్లే ఉంటున్నారు. అప్పో సొప్పో చేసి రూ.30 లక్షలు సమకూర్చుకుని కొడుకు, కుమార్తెని విదేశాలకు పంపించేస్తే వాళ్ల జీవితం సెటిల్ అయిపోతుందని భావిస్తున్నారు. ఇందుకోసం ఉన్న ఆస్తులు, బంగారం బ్యాంకులలో తనఖా పెడుతున్నారు. ఇక ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ సంస్థలు అయితే ఆకర్షణీయమైన ప్రకటనలతో వారికి వల విసురుతున్నాయి. 'మీరు మాకు చిల్లి గవ్వ చెల్లించాల్సిన అవసరం లేదు. మాకు అక్కడి యూనివర్శిటీనే కమీషన్ ఇస్తుంది. పైగా మీ అబ్బాయి, అమ్మాయిని మా సంస్థ ద్వారా పంపిస్తే ల్యాప్‌టాప్, ఫ్లైట్ టిక్కెట్‌లో ఏదో ఒకటి ఇస్తాం' అని ఆకర్షిస్తున్నాయి. అమెరికాకు వెళ్లాలంటే జీఆర్ఈ/టోఫెల్‌లో ఉత్తీర్ణులు కావాలి. ఈ పరీక్షని కూడా కన్సల్టెన్సీ వాళ్లే రాస్తున్నారు. యూకేలోని విశ్వవిద్యాలయాలు అయితే ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే సీట్లు ఇచ్చేస్తున్నాయి. వీసా కోసం రూ.15 లక్షలు యూనివర్శిటీ ఫీజు చెల్లించి మరో రూ.15 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చూపించాలి. ఇన్సూరెన్స్ కోసం రూ.2 లక్షలు చెల్లించాలి. బ్యాంకులో డిపాజిట్ చూపించేందుకు కన్సల్టెన్సీ సంస్థలే రూ. 2 శాతం వడ్డీకి నగదు ఇచ్చి వీసా మంజూరు కాగానే ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేస్తున్నాయి.

విదేశాల్లో దిగిన తర్వాత అసలు కష్టాలు

వీసా తీసుకొని విదేశాల్లో అడుగు పెట్టిన విద్యార్థులకు ఎయిర్‌పోర్టు వద్ద నుంచే అసలు విషయం బోధపడుతోంది. ప్రతీ దానికి అమెరికా, కెనడాలో అయితే డాలర్లు, యూకేలో అయితే పౌండ్లు ఖర్చు చేయాలి. ఎయిర్ పోర్టుల నుంచి కన్సల్టెన్సీలు చూపిన రూంలు సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అక్కడికి క్యాబ్‌లో వెళ్లడానికి రూ.5 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. రూంలో ఇద్దరికి వసతి కల్పిస్తున్నారు. ఇందు కోసం అద్దె నెలకు రూ. 60 వేలు చెల్లించాలి. అంటే చెరి రూ.30 వేలు ఇవ్వాలి. ఇక ఆ రూం నుంచి యూనివర్సిటీకి వెళ్లాలంటే బస్సులు, రైళ్లు ఎక్కాలి. ఇందు కోసం నిత్యం డాలర్లు/పౌండ్లు ఖర్చు చేయాల్సిందే.

తిండికి తిప్పలు

మన దేశంలో వలే అక్కడ ఆహార పదార్థాలు తక్కువ ధరకు లభించవు. కేజీ బియ్యం కొనుగోలు చేయాలంటే రూ. 240 ఖర్చు చేయాలి. హోటల్ నుంచి ఏదైనా బిర్యానీ లాంటి ఫుడ్ ఆర్డర్ పెట్టాలంటే రూ.900 వరకు అవుతుంది. కూరగాయలు ఏవీ కేజీ రూ.100కి తక్కువగా దొరకవు. పాలు, పండ్లు కూడా అదే పరిస్థితి. ఇక్కడ నిత్యం వెరైటీల వంటకాలు చేయించుకొని తినే వాళ్లు అక్కడ సమయానికి బ్రెడ్, పాలు దొరికితే చాలు అని తృప్తి పడాల్సిన పరిస్థితి.

పార్ట్‌టైం జాబ్‌ల కోసం కళ్లు కాయలు కాసేలా

ఆయా దేశాల్లో జీవించాలంటే కచ్చితంగా పార్ట్‌టైం జాబ్ చేసుకోవాల్సిందే. వారానికి 20 గంటలు మించి పని చేయడానికి నిబంధనలు అంగీకరించవు. కొరియర్, ఫుడ్ డెలివరీ వంటి ఉద్యోగాలు చేయాలంటే ఇక్కడి డ్రైవింగ్ లైసెన్సులు అక్కడ పనిచేయవు. దీంతో ఎక్కువమంది వేర్‌హౌస్‌లలో ప్యాకింగ్ సెక్షన్‌లో పని చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. వాటికి అక్కడ విపరీతమైన డిమాండ్ ఉంది. పార్ట్‌టైం ట్యూటర్ జాబ్‌లున్నా వీళ్లకి అంత పరిజ్ఞానం, స్కిల్స్ లేకపోతుండటంతో వాటికి ఎంపికకావడం లేదు. దీంతో ఇక్కడ ముఠాపని అని నామోషీగా భావించే వాళ్లు అక్కడ లారీలలోకి ప్యాకింగ్ చేసిన వస్తువులు లోడింగ్ పని అయినా చేయడానికి ఏమాత్రం సంశయించడం లేదు. కానీ, ఇక వెళ్లిన వెంటనే పార్టుటైం ఉద్యోగాలు దొరకడం లేదు. దాంతో ప్రతి నెలా ఇక్కడి నుంచి తల్లిదండ్రులకు ఎట్టలేదన్నా నెలకు రూ.60వేలు పంపించాల్సిన పరిస్థితి. దీంతో వాళ్ల ప్రతి నెలా అడిగిన మొత్తం పంపించడానికి అప్పుల మీద అప్పులు చేస్తున్నారు.

ఉద్యోగాలపై ఆందోళన


పార్ట్‌టైం జాబ్ కోసమే చుక్కలు కనిపిస్తుండటంతో 20 నెలల తర్వాత తమ చదువు అయిపోతే వీసా స్పాన్సర్ చేసే కంపెనీలు దొరుకుతాయో లేదో తెలియని పరిస్థితి. దీంతో ఇప్పటినుంచే వాళ్లల్లో ఆందోళన నెలకొంటోంది. ఇంత చేసి వీసా స్పాన్సర్ చేసే కంపెనీ దొరకకపోతే మహా అయితే మరో సంవత్సరంపాటు అక్కడ ఉండనిస్తారు. ఆ తర్వాత స్వదేశానికి గెంటేస్తారు.

వారంలో రెండే రోజులు తరగతులు

ఇక్కడ మన విద్యా విధానానికి, అక్కడి యూనివర్సిటీల చదువుకు చాలా వ్యత్యాసం ఉంది. మన దేశంలో ఏ విశ్వవిద్యాలయం, కళాశాల అయినా వారంలో ఆరు రోజులు తరగతులు నిర్వహిస్తాయి. తరచుగా టెస్టులు జరుపుతారు. అలానే ఇంటర్వ్యూలకు యాజమాన్యాలు సిద్ధం చేస్తాయి. అక్కడ అలాంటి పరిస్థితి లేదు. వారంలో కేవలం రెండే రోజులు యూనివర్సిటీలలో తరగతులు నిర్వహిస్తారు. మిగతా ఐదు రోజులు ఖాళీనే. దాంతో విద్యార్థులు జల్సాగా తిరగడం, పార్టుటైం జాబ్‌లకు వెళ్లడం వంటివి చేస్తుంటారు.

కుటుంబ వ్యవస్థకు సవాలు

● సమాజంలో పెరిగిపోతున్న వివాహేతర బంధాలు
● తాత్కాలిక ఆకర్షణకు లొంగి.. విలువలకు తిలోదకాలు
● పెద్దల తప్పునకు రోడ్డున పడుతున్న కుటుంబాలు
● బాపట్ల నడిబొడ్డున ఇద్దరు మృత్యువాత కలకలం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైవాహిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. కట్టుబాట్లను కాదని జీవితాలను భార్యభర్తలు నాశం చేసుకుంటున్నారు. తాత్కాలిక ఆకర్షణలకు లొంగి దశాబ్దాల బంధాలకు బీటలు వేస్తున్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న విడాకుల కేసులకు విచ్చలవిడితనం ఓ కారణంగా తెలుస్తోంది. పెద్దలు చేసిన తప్పు వారి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. తర్వాత వారి భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏళ్ల తరబడి సాగుతున్నప్పటికీ అనైతిక బంధాలు ఏదో ఒక రోజున విషాదాన్నే మిగులుస్తాయి. రెండు కుటుంబాల్లోనూ ఎదురయ్యే పరిణామాల వివాహేతర సంబంధం పెట్టుకున్న వారికి ముందే తెలిసినా.. తాత్కాలిక ఆకర్షణకు లొంగి తమ భవిష్యత్తుతో పాటు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. వారు కూడా సమాజం ముందు దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి రావడమో లేక అవమానాలు ఎదుర్కోవడమో జరుగుతోంది. దాదాపు 25 ఏళ్లుగా వివాహేతర బంధంలో ఉన్న ఇద్దరి ప్రాణాలు అగ్నికి ఆహుతైన ఘటన బాపట్ల పట్టణం నడిబొడ్డున ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. మన సమాజంలో అత్యంత బలంగా వేళ్లూనుకున్న కుటుంబ వ్యవస్థకే ఈ విషాదం సవాల్ విసురుతోంది.

రెండు ప్రాణాలు తీసిన వివాహేత సంబంధం

బాపట్ల పట్టణానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఒకరు ఇంటి పక్కనే ఉంటున్న మహిళతో దాదాపు 25 ఏళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వీరి బంధం ఇరు కుటుంబాల్లోనూ కొన్నేళ్లుగా చిచ్చు రేపుతూనే ఉంది. తరచూ ఇరువైపులా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి ఒకరినొకరు దూషించుకోవడం వరకు వెళ్లింది. ఈ క్రమంలో వివాహేతర బంధం కొనసాగిస్తున్న మహిళ క్షణికావేశంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. ఆమెను కాపాడే క్రమంలో ప్రియుడికి మంటలు అట్టుకున్నాయి. తీవ్ర గాయాలతో ఇద్దరూ మూడు రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూశారు. రెండు కుటుంబాలు ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నాయి. వారి పిల్లలూ స్థిరపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఘటన చర్చకు దారి తీసింది.

స్వీయ నియంత్రణే కీలకం

బయటకు వెళితే ఎన్నో ఆకర్షణలు ఎదురవుతుంటాయి. ఆ సమయంలో ఒక్కసారి కుటుంబాన్ని, మనమీద ఆధారపడ్డ వాళ్లను గుర్తుచేసుకుని మనల్ని మనం నియంత్రించుకోగలిగితే ఎటువంటి అనర్థాలకు అవకాశం విశ్లేషకులు చెబుతున్నారు. ఆ నియంత్రణ మన కుటుంబ భవిష్యత్తునే నిర్దేశిస్తుందని సూచిస్తున్నారు.

వేలితో గ్యాస్ మంటను ఆపొచ్చు

● ఆకట్టుకున్న అగ్నిమాపకశాఖ మాక్ డ్రిల్
● పాల్గొన్న శాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గుంటూరు లోని నెక్స్ జన్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ ఆద్యంతం ఆకట్టుకుంది. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో కంగారు పడకుండా తప్పించుకోవడం, మంటలను అదుపులోకి తీసుకురావడంపై గుంటూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదట సిబ్బంది కొన్ని ప్రయోగాలు ప్రదర్శించి, ఆ తర్వాత విద్యార్థులతో వాటిని చేయించారు. అగ్నిమాపక శాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్ సమక్షంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. చుట్టూ గోడలు ఉన్న ప్రదేశంలో అగ్నిప్రమాదం జరిగితే అందులో చిక్కుకున్న వాళ్లు ఎలా బయటకు తీసుకురావాలో తొలుత చూపించారు. తదుపరి గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే వాటిని ఎలా ఆర్పాలో చూపించారు. సిలిండర్‌లో మంటలు చెలరేగినప్పుడు గ్యాస్ బయటకు వచ్చే రెగ్యులేటర్ వద్ద వేలును ఉంచి అదుపు చేయవచ్చునని విద్యార్థులకు డెమో ఇచ్చారు. తర్వాత అదే ప్రయోగాన్ని చిన్న పిల్లలతో కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ రీజినల్ అధికారి ఎంఏక్యూ జిలానీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డి, స్థానిక అధికారులు శ్రీనివాసరావు, కృష్ణా రెడ్డి, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎత్తుకొని బయటకు తెస్తున్న దృశ్యం


అగ్నిప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స


సిలిండర్‌లో మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో చూపిస్తున్న దృశ్యం



దైవాలరావూరులో రీ సర్వేను
పరిశీలించి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

రీసర్వేను వేగవంతం చేయండి

మేదరమెట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దైవాలరావూరులో జరుగుతున్న రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి ఆదేశించారు. గురువారం దైవాలరావూరు వచ్చిన ఆయన వీఆర్వోలు, సర్వేయర్లు, రీ-సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో రీ-సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 75శాతం సర్వే నంబర్లవారీగా విస్తీర్ణాలను రైతులు భాగస్వామ్యంతో పూర్తి చేశామని, మిగిలిన సర్వే నంబర్లలో సమస్యలుంటే రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ ఇక్కడే అందుబాటులో ఉంటారన్నారు. తప్పులు దొర్లకుండా డీఎల్ఆర్‌ను పూర్తి చేయాలన్నారు. వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను పొరపాట్లు దొర్లకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రీ-సర్వే డీటీ రవికాంత్, సర్వేయర్ మహేష్‌బాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వోలు నరసింహారావు, నారాయణ, మారుతి, సుధాకర్ పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- విద్యుదాఘాతానికి తండ్రి మృతి
- శోకసంద్రంలో కుటుంబం



చుక్కా శ్రీనివాసరావు(ఫైల్)

బోయినవారిపాలెం (చీరాల), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కుమారుడికి పెళ్లి కుదిరింది. అంతా ఘనంగా చేయాలంటూ ఎంతో ఉత్సాహంగా అందుకు సంబంధించి పనుల్లో నిమగ్నమైన తండ్రిని విధి వంచించింది. విద్యుదాఘాతానికి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన చుక్కా శ్రీనివాసరావు(52), లక్ష్మీ దంపతులు. వీరిది వ్యవసాయ కుటుంబం కాగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి గతంలోనే పెళ్లి అయింది. గత ఆదివారం గ్రామంలోనే రెండో కుమారుడి మహేష్‌కు పెద్దల సమక్షంలో సంబంధం కుదిరింది. వచ్చే నెలలో పెళ్లి నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కుమారుడి కోసం పూరింటికి గడ్డి కప్పుతుండగా ఇంటిపై ఉన్న విద్యుత్ తీగల జాయింట్ చేతికి తగిలి శ్రీనివాసరావు కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి మృతి చెందారు. దీంతో సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకున్న మృతదేహానికి గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



చీరాల పట్టణంలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చీరాలలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడీ గురువారం రాత్రి చీరాల పట్టణం, పేరాల ప్రధాన సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కూడా చేశారు. తనిఖీలు చేస్తున్న సమయంలో సమీప బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు పరుగులు తీశారు. జిల్లాలో ఏకకాలంలో జరిగిన ఆకస్మిక తనిఖీలతో వాహనదారులు, నేరగాళ్లు ఉలిక్కిపడ్డారు. అనుకోకుండా పోలీస్ బాస్ రావడంతో స్థానిక పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు.

మార్టూరు సెంటర్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

మార్టూరు: ఎస్పీ ఆదేశాలు మేరకు గురువారం రాత్రి మార్టూరు సెంటర్లో సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాను తనిఖీ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనచోదకులను అదుపులోకి తీసుకోవడంతోపాటు పలు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి

- ఇంటింటికీ తిరిగి అవగాహన పెంచుతున్న ఉపాధ్యాయులు

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న వసతుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న తరగతి నుంచి అప్‌గ్రేడ్ చేసి వారు మరలా ప్రభుత్వ పాఠశాలలోనే ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎంఈవోలు వస్త్రంనాయక్, కె.రమేష్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు.

..ఇక రయ్ రయ్

(5వ పేజీ తరువాయి)

కేటాయించింది. స్వదేశీ దర్శన్- 2.0 కింద బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.97.52 కోట్లు కేటాయించింది. దీనికి తోడు ఇప్పటికే బాపట్ల జిల్లాగా మారడం, ఎన్‌హెచ్-216 జాతీయ రహదారి బాపట్ల గుండా వెళుతుండడంతో కనెక్టివిటీ పెరిగింది. ఈ నేపథ్యలో బాపట్ల నుంచి గుంటూరు, రాజధానికి మధ్య రాకపోకలు బాగా పెరిగాయి. ఈ అవసరాలను ప్రస్తుతం ఉన్న గుంటూరు- చీరాల రోడ్డు తీర్చలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆ రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించాలన్న ప్రతిపాదనలు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ రోడ్డును నాలుగు వరసల రోడ్డుగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు గుంటూరు-పర్చూరు రోడ్డును కూడా నాగులుప్పలపాడు వరకు నాలుగు రోడ్లుగా విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుంటూరు- పర్చూరు- ఒంగోలు- నెల్లూరు మీదగా వెళ్లే ఈ రోడ్డును గతంలో పాత మద్రాసు రోడ్డు అని పిలచేవారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు పర్చూరు వద్ద నకిరేకల్లు- ఓడరేవు జాతీయ రహదారి కూడా అనుసంధానం అవుతోంది. దీంతో ఆ రోడ్డుపై కూడా రద్దీ పెరిగింది. ఆ రోడ్డు గుంటూరు- ప్రత్తిపాడు- పెదనందిపాడు- పర్చూరు- ఇంకొల్లు మీదగా 84.5 కి.మీ వెళ్లి నాగులుప్పలపాడు వద్ద ఒంగోలు- దిగమర్రు జాతీయ రహదారి ఎన్‌హెచ్-216లో కలుస్తుంది. దీంతో గుంటూరు- నాగులుప్పలపాడు మధ్య కూడా ఈ రోడ్డును నాలుగు రోడ్లుగా విస్తరించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు రోడ్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇస్తే ఆ రెండు రోడ్లు కూడా నాలుగు రోడ్లుగా విస్తరిస్తారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

లక్ష్యానికి ఆమడ దూరంలో మార్కెట్ కమిటీ

కొరవడిన పర్యవేక్షణ సిబ్బంది చేతివాటంతో తగ్గిన ఆదాయం

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తులపై వ్యాపారుల నుంచి సెస్ రూపేణా ఆదాయాన్ని సమకూర్చుకోవటంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వెనుకబడింది. 2024-25 సంవత్సరంలో రూ.3.89.50కోట్ల పన్ను లక్ష్యం కాగా కేవలం 2.84 కోట్లు మాత్రమే వసూలు చేశారు. 27శాతం వెనుకబడింది. పర్చూరు ప్రాంతం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యం. ఇక్కడ అన్ని పంటలను రైతులు సాగుచేస్తారు. నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. వరి, శనగ, పొగాకు, మొక్కజొన్న, మిర్చి, పత్తి, పెసలు, మినుములు తదితరాలు సాగులో ఉంటాయి. గత రెండేళ్లుగా దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట ఉత్పత్తులపై మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో భారీగా ఆదాయం రావచ్చని మార్కెట్ శాఖ అధికారులు అంచనా వేశారు. 2022-23లో రూ.3కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, రూ.3.82కోట్లు అంటే 27 శాతం అదనంగా వచ్చింది. 2023-24లో రూ.3.82 కోట్లు లక్ష్యం కాగా 3.34కోట్లు మాత్రమే వసూలు చేసి లక్ష్యం కన్నా 13శాతం తక్కువగా చేయడం గమనార్హం. 2024-25లో పన్ను శాతం 27 శాతం పైగా తగ్గిపోవడం మార్కెట్ శాఖ అధికారులు సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఇంతగా ఆదాయం ఎందుకు తగ్గింది అనే అంచనాలపై సమీక్షిస్తున్నట్లు సమాచారం. పంట ఉత్పత్తులు ఎక్కువ శాతం శీతల గిడ్డంగుల్లో నిల్వచేస్తుంటారు. వ్యాపారులు అక్కడ నుంచే కొనుగోలు చేసి తరలిస్తుంటారు. శీతల గిడ్డంగుల వద్ద వ్యాపారుల కదలికలపై దృష్టి పెడితే మార్కెట్ కమిటీ ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు కొనుగోలు చేసి తరలించే సమయంలో అవినీతికి అలవాటు పడిన కొందరు సిబ్బంది వెళ్లి అనధికారికంగా డబ్బులు తీసుకొని జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ కమిటీలోని కొందరు అవినీతి అధికారులకు ఇందులో వాటా ఉన్నట్లు సమాచారం. సిబ్బందికి మామూళ్లు ఇవ్వడం ద్వారా చెల్లించాల్సిన దానిలో 4వ వంతు మాత్రమే ఇచ్చి వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పన్ను వసూళ్లకు 20 మంది అవుట్ సోర్స్ ఉద్యోగులు

పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పన్ను వసూళ్లకు 20 మంది అవుట్ సోర్స్ ఉద్యోగులు ఉన్నారు. ప్రాంతాలవారీగా విభజించి 19 మందిని వివిధ చోట్ల పన్ను వసూళ్లకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న సిబ్బందికి చాలా మంది వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో వారి కార్యకలాపాలపై పూర్తిస్థాయి అవగాహన ఉంది. దీంతో మార్కెట్ కమిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. దాదాపు రెండు సంవత్సరాలుగా పాలక వర్గం లేక సిబ్బంది చేతివాటానికి కలసి వచ్చిందని అంటున్నారు. తాజాగా ప్రభుత్వం మార్కెట్ కమిటీలపై దృష్టి సారించి కమిటీ ఛైర్మన్‌ల నియామకం చేపట్టింది. అందులో భాగంగా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన గుంజి వెంకట్రావును పర్చూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్త పాలకవర్గం ఆదాయ లక్ష్యంపై దృష్టి సారిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.



పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- ఎస్పీ దామోదర్

మార్కాపురం రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి). పట్టణంలో పోలీసుల పటిష్ట నిఘా ఉంటుదని నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన కర్డెన్ సర్చ్‌ను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కోర్టు కూడలి, కంభం బస్టాండ్, గడియార స్తంభం కూడలిలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పట్టణ ప్రజలు జీవించేలా పోలీసులకు అండగా నిలవాలన్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నేరాల నియంత్రణ చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్ రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ, ఏకలవ్య కాలనీలతో పాటు పలు ప్రాంతాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానకూడలిలో సరైన పత్రాలు లేని వాహనాలను ఆపి పరిశీలించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ కే.నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయిఈశ్వర్, నాగరాజు, రమణ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్పీ, పోలీసులు

ఒంగోలులో దొంగలు హల్‌చల్

- బైక్‌లపై తిరుగుతూ దోపిడీలు
- పోలీసుల అదుపులో నలుగురు దుండగులు?

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో బైక్‌లపై రాత్రుళ్ల తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు దుండగులు. దారి కాచి దోపిడీలు చేస్తున్నారు. దీంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి 11గంటల మొదలు గురువారం తెల్లవారుజామున 4 గంటల వరకు నలుగురు దుండగులు బైక్‌లపై సంచరిస్తూ పలు ప్రాంతాలలో దారి దోపిడీలకు పాల్పడ్డారు. వీరిలో ఓ పాత నేరస్థుడు ఈ ముఠాకు నాయకత్వం వహించాడు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో, మార్కెట్ యార్డు ఎదురు, నెల్లూరు బస్టాండ్ ప్రాంతంలో ఈ నలుగురు బైక్‌లపై రాత్రి అంతా తిరుగుతూ కనిపించిన వారిని బెదిరించి వారి వద్ద సెల్‌ఫోన్లు, జేబుల్లో ఎంత నగదు ఉంటే అంత ఇచ్చే వరకు దాడులు చేశారు.

అంతేకాకుండా స్థానిక మంగమ్మ కాలేజీ సమీపంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆలయ తలుపుల తాళాలు పగులగొట్టారు. హుండీని పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారు. ఇలా నలుగురు దుండగులు తమ ఇష్టానుసారం రాత్రి అంతా నగరంలో హల్‌చల్ చేశారు. స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన నాగూరు అనే పాత నేరస్థుడు, మరో ముగ్గురు యువకులతో కలిసి ఈ దారి దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గురువారం ఉదయం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

- అపరాధ రుసుము విధింపు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఆరుగురుకి జైలు శిక్ష, అపరాధ రుసుము విధిస్తూ అద్దంకి అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి గురువారం తీర్పు ఇచ్చారు. అద్దంకి మండలం మైలవరంలో 2020 సంవత్సరం ఆగస్టు 21వ తేదీన స్థలం వివాదంలో మన్నేపల్లి వెంకటేశ్వర్లును అదే గ్రామానికి చెందిన 7 గురు పథకం ప్రకారం మూకుమ్మడిగా దాడి చేసి, కొట్టి చంపడానికి ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేష్ కేసు నమోదు చేశారు. కేసు విచారణకు రాగా సీఐ సుబ్బరాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి కోర్టు కానిస్టేబుల్ రమణ ద్వారా సాక్షులు సక్రమంగా వాయిదాలకు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకున్నారు.

అద్దంకి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరనారాయణ తగిన సాక్ష్యాధారాలతో నిందితులు నేరం చేసినట్లు నిరూపించడంతో కుడుములపల్లి కోటయ్యకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.12వేల అపరాధ రుసుము, కొండ నాగరాజుకు ఏడాది జైలు, రూ.7వేల అపరాధ రుసుము, మిగిలిన నలుగురు ఉడుములపల్లి సోమయ్య, కుడుములపల్లి పెద్ద కోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కొండ చిరంజీవికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.7వేల అపరాధ రుసుము విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగ వెంకటలక్ష్మి తీర్పు చెప్పినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నిందితులకు శిక్ష పడే విధంగా తగిన చర్యలు తీసుకున్న సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చాలి

మార్టూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం, ఉద్యాన, వ్యవసాయ, వెలుగు శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని వ్యవసాయశాఖ మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై ఆయా శాఖల మండల స్థాయి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి జానకి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కలిగించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఏవో అంజిరెడ్డి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం, మంచి ఆరోగ్యం ప్రకృతి వ్యవసాయం ద్వారా వస్తాయన్నారు. జానకి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం ఆదర్శ రైతులు రామచంద్రరావు, రామాంజనేయులును సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేంద్రబాబు, అడిషనల్ డీపీఎం మోహన్, టీం లీడర్ రాజశేఖర్, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, చందనదుర్గ, శివశంకర్, మండల సమాఖ్య ప్రతినిదులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌యానిమేటర్లు పాల్గొన్నారు.



వంగ తోటలో పిచికారీ చేసేందుకు
తయారు చేస్తున్న కషాయాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి

ప్రకృతి సాగుతో ఆరోగ్యం

యద్దనపూడి: రైతులు తమ సొంత పొలంలో కొంత భాగమైనా ప్రకృతి వ్యవసాయంద్వారా సాగు చేపడితే కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు గురువారం యద్దనపూడి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మేరమ్మ, వెలుగు ఏపీఎం వెంకటరావు, మార్కెటింగ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రకృతి పద్ధతిలో వంగసాగు

పంగులూరు : ప్రకృతి వ్యవసాయ విధానంలో వంగ సాగు లాభదాయకంగా ఉందంటున్నారు రామకూరు రైతు మానం శ్రీనివాసరావు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు మండలంలో రామకూరు, కోటపాడు గ్రామాలను ఎంపిక చేశారు. రామకూరు గ్రామంలో ఐసీఆర్‌పీల ప్రోత్సాహంతో మానం శ్రీనివాసరావు ఎకరా విస్తీర్ణంలో వంగసాగు చేపట్టారు. సహజ పద్ధతిలో సాగు చేస్తున్న వంగలో తెగుళ్ల, క్రిమికీటకాల నివారణ కోసం ఐసీఆర్‌పీల సూచనలతో పైరుపై పిచికారీ చేసే కషాయాన్ని తయారు చేసి తెగుళ్ల, క్రిమికీటకాల నివారణ చర్యలు చేపడుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. పంచామృతం, పసుపు, ఇంగువతో పాటు పులిసిన మజ్జిగ, బెల్లంతో తయారు చేసిన కషాయం వినియోగంతో పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తున్నాయని రైతు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి వంగ తోటను, తయారు చేస్తున్న కషాయాన్ని పరిశీలించారు. కషాయం పిచికారీతో ఆకుమచ్చ తెగులు, పోషకాల లోపం నివారించవచ్చన్నారు. మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఏఏవో పృథ్వీ, రైతులు పంటను పరిశీలించారు.

డ్రోన్ కెమెరాతో మందుబాబుల పట్టివేత

ఇంకొల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐ సరేష్‌బాబు అధునాతన పరిజ్ఞానంతో బహిరంగ ప్రదేశాలలో మందు సేవిస్తున్న మందుబాబులను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. నాగుచెరువు కట్టపై కొంతమంది బహిరంగంగా మద్యం సేవిస్తుండగా డ్రోన్ కెమెరా సాయంతో వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇకపై రాత్రి వేళ్లలో నిఘా పెంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు వద్దు

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నిర్ణీత వయస్సు లేకుండా బాల్య వివాహాలను చేయడం మంచిది కాదని, బాల్య వివాహం చట్ట రీత్యా నేరమని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు బాల్య వివాహాల వలన ఎదురయ్యే ఇబ్బందులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



జడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపకరణాలు
అందిస్తున్న ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రతినిధులు

పాఠశాలలకు ఉపకరణాల బహూకరణ

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండ మంజులూరు ఉన్నత పాఠశాలతో పాటు కోటపాడు యూపీ పాఠశాలకు లక్షల విలువ చేసే ఉపకరణాలను అందచేసి తమ వితరణ చాటుకున్నారు ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ లిమిటెడ్ ప్రతినిధులు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్, సీపీయూ, 8 సీలింగ్ ఫ్యాన్‌లు, 25 కుర్చీలు, రెండు ర్యాకులను, అలాగే కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు బీరువాలు, డెస్క్‌టాప్‌తో పాటు, డెస్క్‌టాప్ టేబుల్, మూడు ఎస్ టైప్ కుర్చీలు, ఆఫీస్ టేబుల్‌ను అందజేశారు. పాఠశాలలకు వసతులతో పాటు విద్యా ఉపకరణాలు అందజేసిన ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు, అందుకు ప్రోత్సాహాన్నిచ్చిన ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ నతానియేల్‌కు హెచ్ఎం ఇమ్మడిశెట్టి అణిత, వడ్లమూడి వేణుబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాసరావు, చింతల సహదేవుడు, విద్యాదాత బొప్పుడి నాగేశ్వరరావు, రావుల వెంకన్న, సురేష్, హరిబాబు, జనార్దనరావు, నాగేశ్వరరావు, పేర్ని వీరనారాయణ, బుల్లిబాబు, స్టాఫ్ సెక్రటరీ రామకోటిరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతలపాడులో ప్లాస్టిక్ టబ్‌లను
పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార స్వామి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో జి.కుమార స్వామి అన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తను సేకరించేటప్పుడు విధిగా తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ప్లాస్టిక్ టబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, కృష్ణమోహన్, నాయకులు పాల్గొన్నారు.

మెప్మా ఒంగోలు సీఎంఎం విధుల నుంచి తొలగింపు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
- ఉత్వర్వులు జారీ చేసిన పీడీ శ్రీధర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఒంగోలు సిటీ మిషన్ కల్పనను విధుల నుంచి తొలగించి, రాష్ట్ర మిషన్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో జరిగిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కాగా, ఈ కార్యక్రమానికి ఖర్చుల పేరుతో ఆర్పీల నుంచి రూ.400 చొప్పున వసూలు చేయడంపై సీఎంఎం అవినీతిని ఆంధ్రజ్యోతి 'సీఎం సభ పేరుతో వసూళ్ళు' కథనం ప్రచురించింది. దీనిపై మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలతో ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పట్టణ పొదుపు సంఘాల సమాఖ్య సంఘాలు 134 ఉండగా ఒక్కో సంఘం నుంచి రూ.1000 వసూలు చేశారు. సహకార శాఖకు ఒక సమాఖ్య నుంచి రూ.50 చెల్లించడం, మిగిలిన సొమ్ము కాజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కల్పనను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర మిషెన్‌డైరెక్టర్‌కు సరెండెర్ చేశారు.

తప్పిపోయిన చిన్నారి

- తండ్రికి అప్పగించిన పోలీసులు

పెద్దదోర్నాల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన బధిర బాలుడు గురువారం ఉదయం ఇంటి నుంచి తప్పిపోయాడు. ఎంత వెదికినా కనిపించక పోవడంతో భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ఆర్‌టీసీ బస్టాండు పరిసరాలలో సంచరించినట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి బాలుడిని గుర్తించారు. వెంటతీసుకుని వెళ్లి తల్లిదండ్రులకు అప్పజెప్పడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



హసన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ ముస్లిం నేతలు

ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌కు అద్దంకి నేతల శుభాకాంక్షలు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గా నియమితులైన హసన్‌బాషాను అద్దంకి నియోజకవర్గ టీడీపీ ముస్లిం నేతలు గురువారం గుంటూరులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, రఫీ, బషీర్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ సర్వేపల్లికి నివాళి

ఇంకొల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి

సర్పంచ్ అంజమ్మ



మంచినీటిని అందిస్తున్న సర్పంచ్ అంజమ్మ

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ మల్లా అంజమ్మ కోరారు. గురువారం బొమ్మల సెంటర్, వైజంక్షన్‌లో రోటరీ క్లబ్‌ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కృష్ణ మోహన్, ఆంజనేయులు, ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకిలో అభివృద్ధి పనులు

» రూ.1.5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం



న్యూ ఎస్‌బీఐ కాలనీ నుంచి నాగులపాడు రోడ్డు వరకు సైడ్ డ్రైన్ నిర్మాణానికి తవ్విన కాలువ

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున అబివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.6.5కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కొన్ని పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్‌లు పూర్తయి ప్రారంభించగా, మిగిలిన వాటికి టెండర్‌లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సుమారు రూ.1.5కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు టెండర్‌లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ అండ్ యస్‌ఎల్‌ఆర్‌యస్ పథకం ద్వారా సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరు కాగా సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, పార్కుల అభివృద్ధి చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ఆయా పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపారు. టెండర్‌లు పిలిచేందుకు సిద్ధం చేస్తున్నారు. జనరల్ ఫండ్ నుంచి సుమారు కోటి రూపాయలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో పట్టణంలోని ఆయా ప్రాంతాలలో రోడ్లు, సైడ్ డ్రైన్‌ల సమస్య తీరనుంది. పనులు వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

» వేసవి తాకిడికి ఘటనలకు అవకాశం

» వారోత్సవాల్లో వేళ జోరుగా అవగాహన కార్యక్రమాలు

» జాగ్రత్తలతోనే నష్టాలకు దూరం

చివరి మూడేళ్లుగా జరిగిన ఘటనలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	నష్టం	రక్షణ
2022 - 23	78	79,23,000	1,19,87,000
2023 - 24	92	100,95,12,000	151,69,48,000
2024 - 25	66	4,89,25,000	7,60,15,000



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు ఎండలు మండుతున్నాయి. చీరాల, చుట్టపక్కల అధిక సంఖ్యలో రైతులు, కూలీలు ఉన్నారు. ఈక్రమంలో పాడి, పంట సహజంగానే ఉంటాయి. ప్రతి ఏటా ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. చీరాల కేంద్రంగా చీరాల, వేటపాలెం, కారంచేడు, పర్చూరు, చినగంజాం, ఇంకొల్లు మండలాలకు చీరాల నుంచే గంటల బండి (అగ్నిమాపక వాహనం) వెళ్లాల్సి ఉంది. అయితే ఇక్కడ ప్రస్తుతం రెండు వాహనాలు ఉండగా (ఒకటి చిన్నది, మరొకటి పెద్దది) 22 మంది సిబ్బంది ఉన్నారు. ఇంకా సిబ్బంది కొరత ఉంది. అలాగే ఇన్ని ప్రాంతాలకు సంబంధించి వాటర్ బండి 01, మిస్ట్ విష్‌కాల్ వాహనం 01 (ఇరుకు సందుల్లో తిరిగే బండి), బుల్లెట్ 01 మాత్రమే ఉన్నాయి. జిల్లా విభజన జరిగి రెండేళ్లవుతున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వసతులు ఉన్నాయి. మరోవైపు ఈనెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలను అధికారులు జోరుగా నిర్వహిస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అవసరంగా అభి వృద్ధి, వసతులు పెరగాల్సి ఉంది. ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రాలపై దృష్టి సారించాలి.

అగ్ని ప్రమాదాలను నియంత్రించాలంటే ముందుగా నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలి. ఆ జాగ్రత్తలు పాటించాలి. గతంలో మండల పరిధిలోని కావూరివారిపాలెంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా ఒకే వీధిలో సుమారు 13 పూరిళ్లు గంటలోనే బూడిదయ్యాయి. అంతేకాకుండా చీరాల నుంచి అందుబాటులో ఉన్నది రెండు వాహనాలే కావడంతో 6 మండలాలపై దృష్టి సారించడం కష్టతరంగానే భావించాలి. ఉదాహరణకు ఒక మండలం నుంచి మరో మండాలనికి విస్తీర్ణం అధికంగా ఉండటంతో సాధ్యసాధ్యాలు బేరీజు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు చెప్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1 గడువు చెల్లిన గ్యాస్ పైపులు, నాణ్యత లేని పైపులు వాడరాదు.

2 వంట గదిలో అదనపు గ్యాస్ సిలిండర్, కిరోసిన్, డీజిల్ వంటివి ఉంచకూడదు

3 నివాసాల్లో జాయింట్‌తో కూడిన విద్యుత్ తీగలు ఉంచరాదు.

4 గడ్డివాముల సమీపంలో మంటలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి.

5 వంట సమయంలో కాటన్ దుస్తులను వినియోగించాలి

6 టపాకాయలు కాల్చే సమయంలో పరిసరాలపై దృష్టి సారించాలి

7 ఇంట్లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలి

గ్యాస్ నుంచే వచ్చే మంటలు ఆర్పడంపై అవగాహన

అద్దంకి : వంట గదిలో గ్యాస్ లీకై వచ్చే మంటలు ఆర్పడంపై విద్యార్థినులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఏర్పడే మంటలు ఆర్పడంపై బాలికలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం



వేసవి ప్రభావంతో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం అధికం. ఈ నేపథ్యంలో వారోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో ముఖ్యంగా గృహిణిల్లో ధైర్యం నింపుతున్నాం. అలాగే నివాసాల్లో జాగ్రత్తలు కూడా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈక్రమంలో గడ్డి వాములు, పూరిళ్లు, విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి.

- వీవీ రామకృష్ణ, సహాయ అగ్నిమాపక జిల్లా అధికారి



వైద్యశాల ప్రాంగణంలో మందులను తీసుకెళ్తున్న సిబ్బంది

పశు వైద్య శాల సిబ్బంది అవస్థలు

» మందులను నిల్వ చేసుకునే వసతి కరువు

» ఒక్కరోజులోనే వాటి పంపిణీకి పరుగులు

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుల (ఏడీ) కార్యాలయం, ఆసుపత్రిలో అసౌకర్యాల నడుమ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సొంత భవనం నిర్మించాలన్న దశాబ్దాల ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. చాలీచాలని ఇరుకు గదులు, ప్రాంగణంలో ఇటు ఇబ్బంది, అటు పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణ స్థలంలో ఆక్రమించి కట్టిన నివాసంలో తాత్కాలికంగా పశు వైద్యశాలను నడుపుతున్నారు. రెండు చిన్నగదులే ఉండడంతో కనీసం మందులు భద్రపరుచుకునే అవకాశం లేదు. గురువారం ఏడీ పరిధిలో ఆయా గ్రామీణ పశువుల ఆసుపత్రులకు మందులు పంపిణీ చేసేందుకు పెద్ద మొత్తంలో పర్చూరు పశువైద్యశాల (ఏడీ)కు మందులు వచ్చాయి. ఇక్కడ మందులు నిల్వ చేసే వసతి లేకపోవడంతో వైద్యశాల ఆవరణలోనే వెనువెంటనే ఆయా పశు వైద్యశాలలకు మందులను పంపిణీ చేశారు. ఈ క్రమంలో దీంతో మందులు ఇచ్చిన వారు, తీసుకెళ్లేందుకు వచ్చిన సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.

రైతులను ఆదుకోవాలి

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షానికి అద్దంకి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. కోతదశలో ఉన్న మొక్కజొన్న నేల వాలడంతో నష్టం జరిగిందన్నారు. మొక్కజొన్న, మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, కృష్ణకుమారి, సుబ్బరాజు, ఏలియా పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలి

మార్టూరు : అకాల వర్షాలకు మండలంలో నష్టపోయిన పంటల వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదికను పంపించాలని మండల రైతు సంఘం నాయకులు గురువారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వై శ్రీనివాసరావుకు వినతిపత్రంలో కోరారు. మొక్కజొన్న, మిర్చి, బర్లీపొగాకు, మామిడికి తీవ్ర న ష్టం జరిగిందని, వెంటనే ఎన్యుమరేషన్ చేసి రైతులకు నష్టపరిహారం అందజేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తుల హ నుమంతరావు, కృష్ణమూర్తి, రాంబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న సిబ్బందికి ఓడీలను కేటాయించాలి

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలని ఎన్‌ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం డిపో వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. డిప్యూటేషన్‌ను కొనసాగించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాబాబు, రవిబాబు, ప్రవీణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీహర్షిణి విద్యార్థుల ప్రతిభ

మార్టూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీహర్షిణి ఒలంపియాడ్ స్కూల్‌లో వందమంది హైస్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 66 మంది సెకెండ్ లెవెల్‌కు హాజరయ్యారని విద్యా సంస్థల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు గురువారం ప్రకటనలో తెలిపారు.

విద్యార్థికి అభినందనలు

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన మందా వివేక్ క్రిస్టియన్ సంగీత పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. దీంతో గురువారం పాఠశాలలో వివేక్‌ను ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గిన్నిస్ రికార్డ్ సాధించడం గొప్పవిషయమన్నారు. అనంతరం గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థికి బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబుల లారీ పట్టివేత



బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం నుం చి అక్రమంగా, ఎలాంటి బిల్లులు లేకుండా తరలిపోతున్న గ్రానైట్ స్లా బుల లారీని గురువారం విజిలెన్స్ ఏ డీ రామంచంద్ర ఆదేశాల మే రకు ఆర్‌ఐ రాజు పట్టుకున్నారు. వే మవరం గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి స్లాబులతో వెళుతున్న లారీని విజిలెన్స్ అధికారులు నిలుపుదల చేసి తనిఖీలు చేయగా, సరైన పత్రాలు లేకపోవడంతో వెంటనే కేసు న మోదు చేసి పట్టుకొన్న లారీని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. ముగ్గురికి గాయాలు



లారీ ఢీకొని బోల్తా పడిన ఆటో

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం నుంచి చెరుకుపల్లికి ఆటోలో ప్రయాణిస్తు మార్గమధ్యలో మంచినీళ్లు తాగేందుకు రోడ్డు పక్కన ఆపిన ఆటోను వేరుశనగ లోడుతో వెళుతున్న లోడు లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం జాతీయ రహదారిలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదే సమయంలో ఆటో సైతం బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

కారు, మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కారు, మోటార్‌సైకిల్ ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు, శింగరకొండ వైపు నుంచి చక్రాయపాలెం వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ నామ్ రోడ్డులో భవనాసి చెరువు కట్ట జంక్షన్ వద్ద గురువారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న చక్రాయపాలెంకు చెందిన గుమ్మడి వెంకటవీరరామాంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఒంగోలుకు చెందిన రమ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వెంకటవీరరామాంజనేయులును ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అలాగే శింగరకొండ రోడ్డులో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. పంగులూరు మండలం చినమల్లవరానికి చెందిన శ్రీరాం, పల్నాడు జిల్లా ఇనగల్లుకు చెందిన మల్లికార్జున్ వేర్వేరు బైకులపై వస్తూ పట్నంలోని రాణి పెట్రోల్ బంక్ సమీపంలో ఒకరినొకరు ఢీకొన్నారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిశుభ్రతకు తోడ్పాటును అందించండి

» అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష

» 21న మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో మీకోసం



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మన ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టి సారించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామాపురంలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న శానిటేషన్ కార్యక్రమం రేపు శనివారం రామాపురం తీరంలో జరుగనుంది. అందుకు సంబంధించి ఎమ్మెల్యే కొండయ్య ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ప్రజా ఫిర్యాదుల వేదిక మీకోసం కార్యక్రమం ఈనెల 21న చీరాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ పాల్గొననున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎండీ మొయిన్, తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి, డీఎల్‌పీవో శివన్నారాయణ, అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం మేలు



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు



అద్దంకిలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి మేలు చేసిందని ఆ సామాజికవర్గం నాయకులు అన్నారు. గురువారం నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ వలన డీఎస్సీతో పాటు పలు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు, విద్యాలయాల్లో సీట్లు భర్తీకు దోహదపడుతుందని అన్నారు. తద్వారా అణగారిన ప్రజల బతుకులు సాఫీగా సాగుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మున్నంగా అరుణ్ కుమార్, ఉసురుపాటి సురేష్, రావినూతల నాగేశ్వరరావు, గూడూరు శివరామప్రసాద్, ఏసురత్నం, జేమ్స్, దుడ్డు అంకమ్మరావు, సైమన్, వినోద్ పాల్గొన్నారు.

ఆర్డినెన్స్‌పై ఎస్సీ సెల్ నేతల హర్షం

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కు కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావడం పట్ల టీడీపీ ఎస్సీ సెల్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ అద్దంకి నియోజకవర్గ వలపర్ల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం చంద్రబాబు ఎస్సీలలోని 59 కులాలకు న్యాయం జరిగిలా ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ డీఎస్సీ నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు వచ్చిందన్నారు. ఇందుకు సహకరించిన కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ నేతలు మందా నాగేశ్వరరావు, అబ్రహం, కత్తి అశోక్, స్టాలిన్, నరేంద్ర, స్వామి, సామ్యూల్, రాజశేఖర్, కోటయ్య పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి గ్రామాలలో ఐసీడీఎస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. గురువారం కొణిదెన, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడులో తల్లులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వెయ్యి రోజుల్లో బిడ్డకు అందించాల్సిన ఆహారంపై చిత్రాలను గీసి వారికి తెలియజేశారు. కార్యక్రమాలలో సూపర్ వైజర్లు విజయ నిర్మలా, సలోమి, మీరాబీ, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.